ప్రజాశక్తి

సోమవారం 28 ఏప్రిల్ 2025 8 పేజీలు



ప్రకాశం



బాపట్ల



మాట్లాడుతున్న సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

జనం సమస్యలు పట్టించుకోవాలి..

- చంద్రబాబు తక్షణం ప్రజలు అవసరాలు తీర్చాలి
- సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

సిఎం చంద్రబాబునాయుడు విజన్ కంటే ముందు జనం సమస్యలు పట్టించుకోవాలని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు ధూళిపాళ్ల రమాదేవి అన్నారు. ఆదివారం పట్టణంలో పుత్తలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో ఆమె విలేకరులతో మాట్లాడారు. దూరదష్టి ఆలోచన విధానాన్ని పక్కనపెట్టి తక్షణం ప్రజల అవసరాలను తీర్చాలని కోరారు. కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో పెన్షన్ పథకం మినహా మరే పథకం అమలు కాలేదని విమర్శించారు. ప్రజలకు ఇచ్చిన వాగ్దానాలను నెరవేర్చడంలో ప్రభుత్వం చిత్తశుద్ధితో వ్యవహరించడం లేదని విమర్శించారు. మహిళలపై జరుగుతున్న అత్యాచారాల నిరోధానికి ప్రభుత్వాలు కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఇళ్లు కూల్చేయడంపై ప్రశ్నించిన సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావుని రఘురామ కష్ణంరాజు దుర్భాషలాడటాన్ని రమాదేవి తీవ్రంగా ఖండించారు. సమావేశంలో సిపిఎం జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య పాల్గొన్నారు.

రైతులను నమ్మించి..మోసగించి..

- బర్లీ రైతులను నిలువునా ముంచిన పొగాకు కంపెనీలు
- కర్షకుల గోడు పట్టించుకోని పాలకులు, అధికారులు
- అప్పుల ఊబిలో కూరుకుపోతున్న అన్నదాతలు..
- నేడు పర్చూరు, ఇంకొల్లులో సదస్సులు



బర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు కొనుగోలు చేయాలని రైతుల రాస్తారోకో (ఫైల్)

ప్రజాశక్తి-పంగులూరు

'ఈ సంవత్సరం కన్నా వచ్చే సంవత్సరం పొగాకు మార్కెట్ ఇంకా బాగా ఉంటుంది. ఇంకా ధరలు బాగా పెరుగుతాయి. నల్లబర్లీ పొగాకుకు మంచి రేటు వచ్చే అవకాశం ఉంది. ఎక్కువ విస్తీర్ణంలో సాగు చేయండి. కొనే బాధ్యత మాది. తక్కువ పెట్టుబడితో ఎక్కువ లాభాలు తెచ్చే నల్లబర్లి పొగాకును సాగు చేయాలి' అని ప్రముఖ పొగాకు కంపెనీలైన ఐటిసి, జిపిఐ, మొదలైన కంపెనీలు రైతులకు మాయమాటలు చెప్పి, బాగా నమ్మించి, అధిక విస్తీర్ణంలో నల్లబర్లీ పొగాకును సాగు చేయించాయి. తీరా పొగాకు రైతు చేతికి వచ్చేసరికి కంపెనీల ప్రతినిధులు దానిని కొనుగోలు చేయకుండా నెలలు తరబడి సాకులు చెబుతూ, వాయిదాలు వేస్తూ, ముఖం చూపించకుండా తిరుగుతున్నారు. కంపెనీల



నిల్వ ఉంచిన బర్లీ పొగాకు

మాటలు విన్న రైతులు అప్పులు తీసుకొచ్చి, కౌలు రేట్లు పెరిగిన అధిక రేట్లకు భూమిని కౌలుకు తీసుకొని సాగు చేశారు. లక్షలాది రూపాయలు పెట్టుబడి పెట్టి, కష్టపడి పండించి, అటు సరుకు అమ్ముడు పోక, ఇటు అప్పుల వాళ్ల ఒత్తిళ్లు తట్టుకోలేక ఇబ్బందులు పడుతున్నారు. పాలకులు గానీ, అధికారులు గానీ పట్టించుకున్న దాఖలాలు లేవు. పొగాకు కొనుగోలు చేయాలని నెలరోజులకు పైగా రైతులు ఆందోళన చేస్తున్నా వీరిలో స్పందన లేదు. బాపట్ల జిల్లాలోని పర్చూరు, అద్దంకి నియోజకవర్గాల్లో సుమారు లక్ష ఎకరాల్లో ఈ సంవత్సరం బర్లీ పొగాకును రైతులు సాగు చేశారు. అందులో 20 వేల ఎకరాలు తెల్లబర్లీ కాగా 80 వేల ఎకరాల్లో నల్లబర్లీ పొగాకును రైతులు సాగు చేశారు. ఇందులో 80 శాతం మంది కౌలు రైతులే. కంపెనీల వాళ్ల మాటలు నమ్మి అధిక ధరలకు పోటీపడి భూములు కౌలుకు తీసుకొని సాగు చేశారు. ఎకరాకు లక్ష నుండి లక్షా 30 వేల రూపాయల వరకు పెట్టుబడులు పెట్టారు. తెల్లబర్లీ పొగాకును కొంతవరకు కొనుగోలు చేసిన కంపెనీలు నల్లబర్లీ పొగాకు కొనుగోలును ఇంతవరకు ప్రారంభించలేదు. రైతులను అడిగితే అదిగోఇదిగో అంటూ వాయిదాలు వేస్తూ వస్తున్నారు.

పెరిగిన పెట్టుబడులు

బర్లీ పొగాకు సాగులో గత సంవత్సరం కన్నా ఈ సంవత్సరం పెట్టుబడి విపరీతంగా ▶ 2లో

డిఆర్‌సి మళ్లీ ఎప్పుడో.?

- వాయిదాతో కీలక అంశాలపై కొరవడిన చర్చ
- పురోగతి లేని గత డిఆర్‌సి ప్రాధాన్యత నిర్ణయాలు
- మళ్లీ తెరపైకి గిట్టుబాటు ధరలు, వేసవి సమస్యలు



ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

టిడిపి నేత హత్య నేపథ్యంలో డిఆర్‌సి సమావేశం వాయిదా పడిన సంగతి తెలిసిందే. మంత్రులు, ఎమ్మెల్యేలు అందరూ రెండు రోజుల పాటు ఇదే వ్యవహారంపై ఉన్నారు. సిఎం చంద్రబాబు కూడా జిల్లాకు వచ్చి వెళ్లారు. అయితే ఇప్పుడు డిఆర్‌సి సమావేశం మళ్లీ ఎప్పుడనేదీ నిర్ణయించాల్సి ఉంది. ఇన్‌ఛార్జి మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఈ సమావేశం తేదీ ఖరారు చేయాల్సి ఉంది. సమావేశం హఠాత్తుగా వాయిదా వేయాల్సి వచ్చింది. దీంతో జిల్లాలో కీలకమైన అంశాలు, సీజనల్ సమస్యలపై చర్చ లేకుండా పోయింది. వీలైనంత త్వరగా డిఆర్‌సి ఏర్పాటు చేయాల్సిన అవసరం కూడా ఉంది.

వెలిగొండ ప్రాజెక్టు త్వరితగతిన పూర్తి చేయాలి.. జిల్లా డెయిరీని పునరుద్ధరించాలి.. కందుకూరును ప్రకాశంలో కలపాలి.. మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలి.. చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధి చేస్తే అవు నెయ్యిని వినియోగించుకునే అవకాశం.. ఇంకా తాగునీటి పథకాలు, భూముల సమస్యలు, వెబ్‌ల్యాండ్‌లో ఇక్కట్లు ఇలా అనేక సమస్యలపై గత డిఆర్‌సిలో చర్చ సాగింది. ఎమ్మెల్యేల అభిప్రాయాలను మంత్రులు ఆమోదించారు. అన్నీ చేద్దామంటూ తిరిగి వెళ్లిపోయారు. మళ్లీ మూడు నెలలు గడిచింది. ఇందులో ఏం జరిగాయంటే ఏ ఒక్కటీ ముందుకు సాగలేదు. కొన్ని కాగితాలకే పరిమితం కాగా కొన్ని రాష్ట్ర ప్రభుత్వం చేతిలో ఉన్నాయి. కొన్ని పరిశీలనలో ఉన్నాయి. కొన్ని నివేదికల్లో పెట్టారు. అంతేతప్ప ఏదీ పరిష్కారమైతే కాలేదనే చెప్పాలి. అంటే ఈ మూడు నెలల్లో ఏం జరిగిందో చూశాం. అన్నింటికీ నిధుల్లేక ఏ పనులూ ముందుకు సాగడం లేదు. మధ్యలో అసెంబ్లీ జరిగింది. బడ్జెట్ సమావేశాలు జరిగాయి. బడ్జెట్‌లో జిల్లాకే ఏమైనా నిధులు తెచ్చారా? అంటే ఏమీ లేదు. వెనుకబాటును కేంద్రం గుర్తించింది. పోరాటాలకు ఫలితం లభించింది. పాలకపక్షం మాత్రం వెనుకబాటును అధిగమించేందుకు ప్రణాళికలు రూపొందించాలనే యోచనలో లేదు. విజన్‌లు కాగితాలపైనే అందంగా ఉన్నాయి. నిధుల్లేమి అన్నింటినీ వెంటాడుతోంది. అసెంబ్లీ సమావేశాల నుంచి జిల్లాకు వచ్చిన మేలు పెద్దగా లేదు. ఇక గత డిఆర్‌సిలో ప్రస్తావనకు వచ్చిన కొన్ని కీలక అంశాలను పరిశీలిస్తే ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు సమావేశంలో గట్టిగానే తమ గళం విప్పారు. వెలిగొండ ప్రాజెక్టుపై పశ్చిమ ప్రజాప్రతినిధులు మాట్లాడారు. వీలైనంత త్వరగా పూర్తి చేయాలన్నారు. దీనికి బడ్జెట్‌లో మొండిచేయి చూపారు. మొక్కుబడిగా రూ.306 కోట్లు కేటాయించారు. ఇటీవల మంత్రివర్గ సమావేశంలో తీగలేరు కాలువ, హెడ్ రెగ్యులేటర్ పనుల కోసం రూ.106 కోట్లు కేటాయించారు. వాస్తవానికి ప్రాజెక్టు పరిధిలో నిర్వాసితులను బయటకు తేవాలి. వారి ప్యాకేజీలకు రూ.889 కోట్లు నిధులు ఇవ్వాలని కలెక్టర్ అన్సారియా ఇటీవల జరిగిన కలెక్టర్ల సమావేశంలో సిఎం చంద్రబాబును నివేదించారు. ఆ నిధులు రాలేదు. మంత్రి మండలిలో స్వల్పంగా ▶ 2లో



అధికారులతో మాట్లాడుతున్న మంత్రి స్వామి

అర్హులందరికీ 'ఉపాధి'

- ప్రతి ఒక్కరికీ పనులు కల్పించాలి
- మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి

ప్రజాశక్తి-టంగుటూరు

అర్హులైన ప్రతి ఒక్కరికీ మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద పనులు కల్పించాలని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలాశ్రీ బాల వీరాంజనేయ స్వామి ఉపాధి హామీ అధికారులు, సిబ్బందిని ఆదేశించారు. ఆదివారం నాడు టంగుటూరు మండలం, తూర్పునాయుడుపాలెంలోని తన క్యాంపు కార్యాలయంలో కొండపి నియోజకవర్గ నరేగా, డ్వాక్రా అధికారులతో మంత్రి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ అమలు తీరు, చేపడుతున్న పనులు తదితర అంశాలపై మంత్రి సమగ్రంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ ద్వారా అర్హులైన పేదలందరికీ జాబ్ కార్డులు మంజూరు చేసి పని కల్పించాలన్నారు. పనిచేసే ప్రాంతంలో కూలీలకు ప్రభుత్వ నియమ నిబంధన ప్రకారం అన్ని వసతులు ఉండేటట్లు చూడాలన్నారు. జాతీయ గ్రామీణ ఉపాధి హామీ కింద నిర్దేశించిన పని దినాలను పూర్తి చేయాలని ఆదేశించారు. ఉపాధి పనులు కల్పించేందుకు ఎక్కువ అవకాశం ఉన్న పనులపై దష్టి సారించాలని, ఉపాధి కూలీలకు వంద రోజుల పని దినాలను పూర్తి చేయాలన్నారు. ఉపాధి హామీ కింద రైతులకు పంపిణీ చేసే మొక్కల నాణ్యతపై ప్రత్యేక దష్టి పెట్టాలన్నారు. ఉపాధి హామీ నిబంధనలను పాటిస్తూ పనులను చేపట్టాలని, లక్ష్యాల సాధనలో నిర్లక్ష్యం ▶ 2లో

రైతులను నమ్మించి.. మోసగించి..

(మొదటిపేజీ తరువాయి)

పెరిగింది. గత సంవత్సరం 15 వేల రూపాయలు ఉన్న కౌలు, ఈ సంవత్సరం 20 నుండి 25 వేల రూపాయలకు పెరిగింది. దీనితోపాటు కూలి రేటు, మొక్కల ధర, ఎరువులు , వ్యవసాయం, రవాణా ఖర్చులు కూడా పెరగడంతో ఎకరాకు లక్ష నుండి రూ.1.20 లక్షల వరకు పెట్టుబడి పెరిగింది.

అందని ప్రభుత్వ సాయం

పొగాకు సాగులో అటు ప్రభుత్వం వైపు నుండి గానీ, ఇటు బ్యాంకుల వైపు నుండి కూడా ఎలాంటి సహాయం రైతులకు అందలేదు. కౌలు రైతుల గుర్తింపులో ప్రభుత్వం తీసుకొని నిర్ణయం ఎలాంటి ఉపయోగం లేకుండా చేసింది. అద్దంకి, పర్చూరు నియోజకవర్గం సుమారు లక్షా 25 వేల మంది కౌలు రైతులు ఉంటే, కనీసం 8 వేల మంది కూడా కౌలు గుర్తింపు కార్డులు ఇవ్వలేదు. వీరి పేరుతో ఈక్రాప్ కూడా చేయించుకోకపోవడం వల్ల వీరికి పెట్టుబడి సాయం గానీ, రాయితీలు గానీ అందలేదు. పంట నష్ట పరిహారాలు కూడా వచ్చే అవకాశం లేదు. ఎలాంటి రుణ సౌకర్యాలు కల్పించకపోవడం వల్ల అధిక వడ్డీలకు బయట ప్రైవేట్ ఫైనాన్స్ వారి దగ్గర అప్పులు తీసుకొచ్చి పంటలు సాగు చేశారు. ఒకవైపు పొగాకు కొనుగోలు కాకపోవటం, అప్పులు ఇచ్చిన వాళ్ళ ఒత్తిడి చేయడం రైతాంగాన్ని తీవ్ర మనస్తాపానికి గురిచేస్తోంది. పనిచేసిన కూలీలకు కూడా కూలి డబ్బులు ఇవ్వలేని పరిస్థితిలో రైతులు ఉన్నారు.

ఆందోళనలో రైతులు

గత నెలరోజుల నుండి బర్లి పొగాకు రైతులు ఈ ప్రాంతంలో ఆందోళన చేస్తున్నారు. ధర్నాలు, రాస్తారోకోలు, పొగాకు తగలబెట్టడం వంటి అనేక రూపాల్లో రైతులు నిరసనలు తెలుపుతున్నారు. భవిష్యత్తులో కూడా ఆందోళన పథంలో పయనించేందుకు రైతులు సిద్ధమవుతున్నారు.

అప్పులు ఇచ్చిన వాళ్ల ఒత్తిడి పెరిగింది..

గోగుమళ్ళ సింగయ్య, కౌలు రైతు



బర్లీ పొగాకు సాగు కోసం అప్పులు ఇచ్చిన వాళ్ళ ఒత్తిళ్లు పెరిగాయని పంగులూరు గ్రామానికి చెందిన కౌలు రైతు గోగుమళ్ళ సింగయ్య అన్నారు. తాను పొగాకు కంపెనీ వాళ్ళ మాటలు నమ్మి ఈ సంవత్సరం నాలుగున్నర ఎకరాలు కౌలు భూమి తీసుకొని పొగాకు సాగు చేశానని చెప్పారు. ఇందులో రెండున్నర ఎకరం తెల్లబర్లి, రెండు ఎకరాలు నల్లబర్లి సాగు చేశామన్నారు. కౌలుకు తీసుకున్న నాలుగున్నర ఎకరాల్లో మూడున్నర ఎకరాలకు ఎకరాకు 25 వేల రూపాయలు చొప్పున, ఒక ఎకరానికి పదివేల రూపాయలు చొప్పున కౌలుకు తీసుకున్నామన్నారు. కౌలుతో కలుపుకొని మొత్తం పెట్టుబడి నాలుగు లక్షల రూపాయల వరకు అయిందని, ఇందులో తెల్లబర్లీ పొగాకు 20 క్వింటాళ్లు అమ్మగా వచ్చిన సొమ్ములో లక్ష రూపాయలు అప్పు తీర్చానని, ఇంకా మూడు లక్షల రూపాయలు అప్పు మిగిలిందని అన్నారు. అప్పుతో పాటు వడ్డీ కూడా పెరిగిపోతోందని, పొగాకు అమ్ముడుపోకపోవడం వల్ల డబ్బులు రాక అప్పు తీర్చలేకపోయానని సింగయ్య చెప్పారు. అప్పుల వాళ్ళ ఒత్తిడి పెరిగిపోతోందని ఆవేదన వ్యక్తం చేశారు.

కూలీలకు రూ.80 వేలివ్వాలి..

కౌలు రైతు కొణతం భాస్కరరావు



పొగాకు కంపెనీల వాళ్ళ మాటలు నమ్మి, ఆశతో ఎక్కువ మొత్తంలో సాగుచేసిన తనకు అప్పుల బాధ తప్పడం లేదని కౌలు రైతు కొణతం భాస్కర్‌రావు తెలిపారు. కూలీలకు కూడా కూలి ఇవ్వలేని పరిస్థితిలో ఇప్పుడు ఉన్నామన్నారు. రూ.80 వేల రూపాయలు కూలీలకు ఇవ్వాలని తెలిపారు. పొగాకు కంపెనీ వాళ్ళ మీటింగులు నల్లబర్లీ సాగు చేయమని చెప్పారని, వాళ్ల మాటలు నమ్మి మూడు ఎకరాలు నల్లబర్లీ సాగు చేశానని చెప్పారు. కౌలుతో కలుపుకొని ఎకరాకు లక్ష ఇరవై వేల రూపాయలు పెట్టుబడి అయిందని, మొత్తం మూడు లక్షల 50 వేల రూపాయల వరకు అప్పులు తెచ్చామని చెప్పారు. రెండు రూపాయల వడ్డీ లెక్కన మొత్తం పెట్టుబడి అప్పేనని అన్నారు. తమ భార్యాభర్తల కష్టం పోను ఇంకా రెండు లక్షల రూపాయలు అప్పు మిగిలి ఉందనిచెప్పారు. అప్పుల వాళ్ళ ప్రతిరోజూ ఇంటి చుట్టూ తిరుగుతున్నారని వారికి ఏ సమాధానం చెప్పలేని పరిస్థితిలో ఉన్నామని భాస్కర్‌రావు తెలిపారు.

నేడు సదస్సులు..

రైతులు పండించిన నల్లబర్లీ పొగాకును గిట్టుబాటు ధరకు వెంటనే కొనుగోలు చేయాలని, బర్లీ పొగాకు రైతులను ఆదుకోవాలని కోరుతూ రైతు సంఘం ఆధ్వర్యంలో సోమవారం పర్చూరు, ఇంకొల్లులో సదస్సులు ఏర్పాటు చేస్తున్నట్లు రైతుసంఘం బాపట్ల జిల్లా కార్యదర్శి తలుపనేని రామారావు తెలిపారు. సదస్సులో మాజీ మంత్రి వడ్డే శోభనాద్రీశ్వరరావు, రైతు సంఘం రాష్ట్ర అధ్యక్షులు వి.కృష్ణయ్య, కౌలురైతు సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎం.హరిబాబు, నల్లమడ రైతుసంఘం నాయకులు డాక్టర్ కొల్లా రాజమోహనరావు తదితరులు పాల్గొంటారని తెలిపారు. ఈ సదస్సుకు రైతులు విరివిగా హాజరుకావాలని కోరారు.

అభివృద్ధి పథంలో కొత్తపట్నం హైస్కూలు

పాఠశాల రూపు రేఖలు మార్చేసిన హెచ్ఎం శ్రీదేవి



ప్రార్థనా సమయంలో పాఠశాలలో విద్యార్థులు



హెచ్ఎం శ్రీదేవి

ప్రజాశక్తి-కొత్తపట్నం

కొత్తపట్నం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను అతికొద్ది కాలంలోనే ప్రధానోపాధ్యాయురాలు ఎం శ్రీదేవి స్కూల్ రూపురేఖలు మార్చడంలో కీలకపాత్ర పోషించారు. ఉపాధ్యాయులు, గ్రామస్తుల సహకారంతో పాఠశాలకు పూర్తిస్థాయిలో మౌలిక వసతులు కల్పించారు. ప్రజా ప్రతినిధులు, జిల్లా అధికారుల నేతృత్వంలో పాఠశాలకు హెచ్ఎం వసతులను ఏర్పాటు చేయించగలిగారు. 21.01.2002 లో స్కూల్ అసిస్టెంట్ బయాలజీ ఉపాధ్యాయినిగా చేవూరులో బాధ్యతలు చేపట్టా రు. అనంతరం పొందూరు, కందుకూరు, కొత్తపట్నం స్కూళ్లలో ఇన్‌ఛార్జి హెచ్ఎంగా పనిచేశారు. దీంతో పరిపాలనలో పూర్తిస్థాయిలో పట్టు సాధించారు. నవంబర్ 2023న కొత్తపట్నం హైస్కూల్ ఎఫ్ఎసి హెచ్ఎంగా బాధ్యతలు చేపట్టారు. అప్పటి నుంచి స్కూల్‌పై మక్కువతో అభివృద్ధికి ఎనలేని విధంగా కృషి చేశారు. జిల్లాలోని 1450 మంది విద్యార్థులతో ప్రథమ స్థానంలో ఉన్న హైస్కూల్ అరకొర వసతులతో కొట్టుమిట్టాడు తుండేది. వాటిని అధిగమించి సాధ్యమైనంత వరకు పరిస్థితులు చక్కదిద్దడంలో సఫలీకృతులయ్యారు. వివిధ కారణాలతో నిలిచిపోయిన నాడు నేడు పనులు రూ.27 లక్షలతో తరగతి గదులను పూర్తి చేయించారు. పాఠశాల ఆవరణలో మూడు లక్షల రూపాయలతో గ్రామస్తులు, ఉపాధ్యాయులను ప్రోత్సహించి గ్రామంలో వర్షపు నీరు స్కూల్లోకి రాకుండా గేటు ఎత్తు పెంచడం ద్వారా శాశ్వత పరిష్కారం చూపారు. సరస్వతి విగ్రహానికి మరమ్మతులు చేయించడం, 200 మీటర్ల మేర నాపరాయి స్కూలు ముందు ఆవరణలో చేయించారు. పీఎంశ్రీ క్రింద రూ.4.30 లక్షలతో 200 మీటర్లు, 100 మీటర్లు, వాలీబాల్ కోర్ట్ పనులు హెచ్ఎం హయాంలోనే జరిగాయి. 2024 విద్యా సంవత్సరం ప్రారంభంలో క్రీడా విభాగంలో రాష్ట్ర స్థాయి ఫుట్బాల్ (హిందూపూర్), కబడ్డీ (బాపట్ల), సాఫ్ట్‌బాల్(గుంటూరు), కరాటే(అనంతపురం)కు విద్యార్థులను పంపి పాఠశాలకు గుర్తింపు తీసుకొచ్చారు. 2023 విద్యా సంవత్సరంలో పదో తరగతి ఫలితాల్లో 80 శాతం, 2024లో 88 శాతం ఉత్తీర్ణత సాధించి విద్యార్థులు తల్లిదండ్రులు, జిల్లా అధికారుల మన్ననలను పొందగలిగారు. పాఠశాలలో విద్యుత్ అసౌకర్యం కలుగుతుంటే అధికారులను సంప్రదించి పవర్ సప్లై ఆటంకం కలగ నివ్వకుండా మూడున్నర లక్షల విలువచేసే ట్రాన్స్‌ఫార్మరును అధికారులచే మంజూరు చేయించడంలో కృషి చేశారు. మెగా పేరెంట్స్‌డేకు ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ అధ్యక్షతన పాఠశాల సమస్యలు ఆయన దృష్టికి తీసుకుని వెళ్లి విద్యార్థులు తాగునీటికు ఇబ్బంది పడుతున్నారని తెలియజేయగా ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నేతృత్వంలో దేవి సీ ఫుడ్ సహకారంతో మూడున్నర లక్ష విలువచేసే ఉచిత ఆర్వో ప్లాంట్‌ను ఏర్పాటు చేశారు. డ్రాప్ ఔట్స్ సంఖ్య తగ్గించడం కోసం ఉపాధ్యాయులను కమిటీలుగా నియమించి గ్రామాల్లోనికి పంపించి విద్యార్థులను బడికి వచ్చే విధంగా చేయించగలిగారు. జిల్లా విద్యాశాఖ అధికారులు పాఠశాల తనిఖీ సమయంలో మధ్యాహ్న భోజన పథకం, నిర్వహణ తీరు సంతృప్తి పరిచింది. ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ నేతృత్వంలో పార్టీ నాయకుల ఆధ్వర్యంలో పాఠశాల యాజమాన్య కమిటీ ఎన్నిక ప్రశాంతంగా నిర్వహించి గ్రామస్తులు అధికారుల మన్నన పొందగలిగారు. కొన్ని సంవత్సరాలుగా పెండింగ్‌లో ఉన్న విద్యుత్ బకాయి రూ.1,40,000 ప్రభుత్వం మంజూరు చేసి విద్యుత్ శాఖ అధికారులకు బిల్లు చెల్లించడం ఈ హెచ్ఎం హయాంలో జరగడం విశేషం. విద్యార్థులను క్రమశిక్షణలో ఉంచి సమయానికి పాఠశాలకు హాజరయ్యే విధంగా విద్యార్థులలో మార్పు తీసుకురాగలిగారు. పాఠశాలలో 52 మంది ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ వారందరినీ ఐకమత్యంగా ఉంచి వారి సహకారం, ఎస్ఎంసి చైర్మన్ వంశీకృష్ణారెడ్డి సహకారంతో పొరపాట్లు లేకుండా ఈ రెండు సంవత్సరాల పాటు ఎఫ్ఎసి హెచ్ఎం శ్రీదేవి పాఠశాలను అన్ని హంగులతో తీర్చిదిద్దడంలో సఫలీకృతులయ్యారని గ్రామస్తులు, పూర్వ విద్యార్థులు, తల్లిదండ్రుల నుంచి ప్రశంసలు వెల్లువెత్తుతున్నాయి.

అర్హులందరికీ 'ఉపాధి'

(మొదటిపేజీ తరువాయి)

తగదన్నారు. ఉపాధి హామీ పెండింగ్ బిల్లులు కూడా త్వరలో చెల్లిస్తామని మంత్రి డోలాశ్రీ బాల వీరాంజనేయస్వామి తెలిపారు. మంత్రి డ్వాక్రా అధికారులతో మాట్లాడుతూ ఎన్నికల్లో మహిళలకు ఇచ్చిన అన్ని హామీలు నెరవేర్చేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు కషి చేస్తున్నట్లు తెలిపారు. దీపం పథకం ద్వారా అర్హులైన మహిళలకు ఉచితంగా గ్యాస్ సిలిండర్లు అందజేశామన్నారు. ప్రభుత్వం డ్వాక్రా మహిళలను ఆర్థికంగా బలోపేతం చేసేందుకు చర్యలు చేపడుతున్నట్లు మంత్రి తెలిపారు.

డిఆర్‌సి మళ్లీ ఎప్పుడో.?

(మొదటిపేజీ తరువాయి)

పెట్టారు. రెండేళ్లలో వెలిగొండ పూర్తిచేయాలన్న లక్ష్యం ఎలా నెరవేరుతుందో పాలకపక్ష నేతలే చెప్పాలి. కందుకూరును ప్రకాశంలో కలపాలని, మార్కాపురం జిల్లా ఏర్పాటు చేయాలనే వినతి వచ్చింది. దీనిపైనా మంత్రులు ఓకే అన్నారు. కొత్త జిల్లాల ఏర్పాటుపై రాష్ట్ర ప్రభుత్వం ఏ నిర్ణయం తీసుకోలేదు. ఇటీవల జిల్లాకు వచ్చిన సిఎం చంద్రబాబు మరోసారి కొత్త జిల్లా ఏర్పాటుకు హామీ ఇచ్చారే తప్ప నిర్దిష్ట సమయం వెల్లడించలేదు. ఇక మరో కీలకమైన అంశం జిల్లా డెయిరీ. ఇది తెలుగుదేశం హయాంలోనే మూతపడింది. ఆ పార్టీ పాలకవర్గం చేతిలో ఉండగానే మూసేశారు. తర్వాత దాన్ని అమూల్ సంస్థకు అప్పగించారు. దీన్ని తిరిగి పునరుద్ధరించాలనే డిమాండ్ వచ్చింది. ఎన్నికలకు ముందు తెలుగుదేశం నేతలూ ఇదే చెప్పారు. లోకేష్ పర్యటనలోనూ హామీగా ఉంది. గత డిఆర్‌సిలో చర్చ సాగింది. పాలపొడి ఫ్యాక్టరీ రూ.కోట్లు విలువైంది. మూతపడింది. సామగ్రి తుప్పు పడుతోంది. దీనికి రూ.75 కోట్లు నిధులు అవసరమని కలెక్టర్ నివేదించారు. గతంలో మాదిరిగానే పాల సేకరణ, విక్రయాలు సహకార వ్యవస్థతో జరిగే వీలుంది. దీనిపై ఏ నిర్ణయం జరగలేదు. నిధుల్లేవు. చర్యలు అంతకన్నా లేవు. చదలవాడ పశుక్షేత్రం అభివృద్ధి, విస్తరణ ముందుకు సాగలేదు. వీటితో పాటు తాగునీరు, దేవాదాయ భూములు, వెబ్‌ల్యాండ్ సమస్యలు, ఇరిగేషన్ చెరువుల మరమ్మతులు, వివిధ పనులకు బిల్లులు, ఇళ్లస్థలాలు, గృహాలు, భూ కుంభకోణాలు వంటివి ప్రస్తావించారు. వాటికి ఇన్‌ఛార్జి మంత్రి ఆనం కూడా సమాధానం చెప్పారు. పాలనపైనా పలువురు మాట్లాడారు. అన్నింటికీ పరిష్కారాలు చూపుతామనే చెప్పారు. ఈ మూడునెలల్లో ఏం చేశామన్నది ప్రత్యేకంగా చెప్పాల్సిన అవసరం లేదు. ఏ ఒక్క నిర్ణయం వేగంగా అమలు జరగలేదు. అన్నీ యథాతథంగానే ఉన్నాయి. అడుగు కూడా ముందుకు పడలేదు. ఇక కొత్తగా కొన్ని తెరపైకి వచ్చాయి. మిర్చి, శనగ పంటలకు గిట్టుబాటు ధరల్లేవు. పొగాకు కొనుగోళ్ల సంక్షోభంలో పడ్డాయి. రైతులకు గిట్టుబాటు ధర కల్పన ఇప్పుడు కీలక ఎజెండాగా మారింది. వేసవి వచ్చేసింది. తాగునీటి ఎద్దడి మొదలైంది. వేసవి కార్యాచరణపై ఇప్పుడు దృష్టి సారించాల్సి ఉంది. ఉపాధి హామీ కింద పనులు కల్పించాల్సి ఉంది. పాలనపైనా ప్రజల్లో అసంతృప్తి వ్యక్తమవుతోంది. అర్జీలకు పరిష్కారం దొరకడం లేదు. భూముల రీసర్వే ప్రక్రియ కూడా సవాలుగా మారింది. ఈ కీలక అంశాలు చర్చ సాగాల్సిన తరుణం. తక్షణం డిఆర్‌సి ఏర్పాటుకు జిల్లానేతలూ ప్రయత్నాలు చేయాల్సిన అవసరం ఉంది.

సిఐ అవమానించాడని కానిస్టేబుల్ ఉద్యోగం వదిలి..

ఐపీఎస్ సాధించాడు..

ప్రజాశక్తి-శింగరాయకొండ

చిన్నతనంలోనే తల్లిదండ్రులని కోల్పోయి, నాయనమ్మ దగ్గర పెరిగి చదివి కానిస్టేబుల్ ఉద్యోగం సాధించి మెరైన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు నిర్వహిస్తున్న సమయంలో సీఐ అవమానించాడని, అతని కన్నా మంచి ఉద్యోగం సాధించాలని ఆ కసితో చదివి నేడు ఐఏఎస్ సాధించిన మూలగాని ఉదయ్ కృష్ణారెడ్డిది శింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామం. శింగరాయకొండ మండలం ఊళ్లపాలెం గ్రామానికి చెందిన మూల గాని ఉదయ్ కష్ణారెడ్డి చిన్నతనంలోని తండ్రి శ్రీనివాసరెడ్డి తల్లి జయమ్మ లను పోగొట్టుకొని నాయినమ్మ రమణమ్మ సమక్షంలో ఉదయ్ కష్ణారెడ్డి తో పాటు అతని తమ్ముడు ప్రణయ రెడ్డి కలిసి జీవనం సాగించారు. కూరగాయల వ్యాపారం చేస్తున్న నాయనమ్మకు చేదోడు వాదోడుగా ఉంటూ చదువు మొదలుపెట్టాడు. ఉదయ్ కష్ణా రెడ్డి కష్టపడి చదివి ఊళ్ళపాలెం హై స్కూల్ నుంచి విద్యాభ్యాసం ప్రారంభించి కావలి జవహర్ భారతి కళాశాలలో డిగ్రీ పూర్తి చేసి వెంటనే కానిస్టేబుల్ గా ఉద్యోగం సాధించి. గుడ్లూరు పోలీస్ స్టేషన్లో కానిస్టేబుల్ గా ఉంటూ రామాయపట్నం మెరైన్ కానిస్టేబుల్‌గా ఉద్యోగ జీవితాన్ని ప్రారంభించారు. అలా కానిస్టేబుల్ ఉద్యోగం వచ్చిందన్న ఆనందంతో ముందుకు పోతున్న సమయంలో నరైన్ కానిస్టేబుల్‌గా ఉన్న ఆ సమయంలో రామాయపట్నంలో సీఐ సహచర కానిస్టేబుల్ ముందు అవమానించారని కానిస్టేబుల్‌గా ఇలాంటి అవమానాలు తట్టుకోలేక ఎలాగైనా ఐపీఎస్ కావాలన్న లక్ష్యంతో ఆ రోజే ఉద్యోగానికి రాజీనామా చేసి ఎలాగైనా ఉన్నత స్థానానికి ఎదగాలన్న లక్ష్యంతో ఉదయ్ కృష్ణారెడ్డి నేరుగా హైదరాబాదుకు వెళ్లి అక్కడ వసతి గృహంలో ఉంటూ శిక్షణ మొదలు పెట్టాడు. మూడు ప్రయత్నాల్లో అసలు మెయిన్స్‌కు అర్హత సాధించలేకపోయినప్పటికీ ఎలాగైనా అర్హత సాధించాలన్న లక్ష్యంతో ధైర్యంతో ముందుకు అడుగు వేసి అక్కడే శిక్షణ తీసుకున్నారు. నాలుగోసారి 780 ర్యాంకు సాధించి ఐఆర్ఎస్‌కు ఎంపిక అయ్యారు. నాలుగో ప్రయత్నంలో అడుగు ముందుకు కదలడంతో కొంచెం ఆనందపడి ఆ ఉద్యోగంలో చేరి మరోసారి మెరుగైన ర్యాంకు సాధించాలన్న లక్ష్యంతో మళ్ళీ పరీక్ష రాసి తాజాగా 350 ర్యాంకు సాధించి తన కల అయిన ఐపీఎస్ సాధించడం జరిగింది. మెరైన్ కానిస్టేబుల్‌గా అవమానపడిన ఉదయ్ కృష్ణారెడ్డి ఎలాగైనా ఐపీఎస్ సాధించాలన్న లక్ష్యంతో ఎన్నో కష్టాలను ఎదుర్కొని ఆర్థిక ఇబ్బందులలోను ముందుకుపోయి కష్టపడి చదివి తన కల అయిన ఐపీఎస్ సాధించడం జరిగింది. మెరైన్ కానిస్టేబుల్‌గా అవమానాలను జయించి నేడు ఐపీఎస్ సాధించిన ఉదయ్ కృష్ణారెడ్డిని గ్రామస్తులు అభినందిస్తున్నారు.



ఉదయ్ కృష్ణారెడ్డి

మరమ్మతులకు నోచని చెరువు

చిల్లచెట్లు పెరిగి అధ్వానంగా వెంకటాచలంపల్లె చెరువు

300 ఎకరాలకు సాగునీరు అందే అవకాశం

నిధులు కేటాయించాలని గ్రామస్థుల వేడుకోలు

ప్రజాశక్తి-దర్శి

మండలంలోని వెంకటాచలంపల్లిలోని సుబ్బయ్య చెరువు మరమ్మతులకు నోచుకోక అధ్వానంగా తయారైంది. చెరువులో, కట్టపై చిల్లచెట్లు పెరిగి నీరు రాని పరిస్థితి నెలకొంది. నిధులు కేటాయించి చిల్లచెట్లు తొలగించి చెరువుగట్టుకు మరమ్మత్తులు చేయాలని ఆయా గ్రామస్తులు కోరుతున్నారు. చెరువు బాగుపడి జలాలతో నిండితే రెండు గ్రామాల్లో 300 ఎకరాలకు సాగునీరు అందుతుందని, అంతే కాకుండా గ్రామాల్లో భూగర్భజలాలు పెరుగుతాయని గ్రామస్థులు చెబుతున్నారు.



చిల్లచెట్లతో నిండిన వెంకటాచలంపల్లి సుబ్బయ్య చెరువు

వెంకటాచలంపల్లిలో ప్రజల సౌకర్యార్థం నీటి వనరుల కోసం చెరువును సుమారుగా వంద సంవత్సరాల క్రితం సుబ్బయ్య అనే వ్యక్తి 28 ఎకరాలులో గ్రామస్తుల సహకారంతో చెరువును నిర్మించారు. ఆ చెరువు నిండితే వెంకటాచలంపల్లి, నడింపల్లి గ్రామాలకు పుష్కలంగా బావుల్లో నీరు, పశువులకు, మేకలకు అప్పట్లో ఉపయోగపడేది. ఆ నీటితో గ్రామంలో గ్రౌండ్ లెవెల్ నీరు కూడా పెరిగేది. ఇటీవల కాలంలో ఆ చెరువుకు నిధులు కేటాయించకపోవడంతో పిచ్చిచెట్లతో చెరువు నిండి ఉంది. అదే విధంగా చెరువు కట్టపై కూడా పిచ్చి చెట్లు ఉన్నాయి. అప్పట్లో 27, 28 సర్వే నెంబర్లు 28 ఎకరాలలో ఈ సుబ్బయ్య చెరువు ఉండేదని అప్పట్లో 20 ఎకరాలు పైగా నీటి పారుదల కూడా ఉండేదని ఆ గ్రామానికి చెందిన సేజ సుబ్బారావు తెలిపారు. ఈ చెరువుకు ఎనిమిది సంవత్సరాల క్రితం కొంత నిధులు కేటాయించి చెట్లు పీకించారని ఆయన తెలిపారు. ఈ చెరువుకు తానా చింతల పొలం నుంచి వాగు ద్వారా నీరు వస్తాయని ఆ వాగుకు పిచ్చిచెట్లు పడి చెరువులోకి నీరు ప్రస్తుతం నీరు రావడంలేదని ఆ గ్రామానికి చెందిన మాజీ ఎంపీటీసీ అనంత కృష్ణయ్య, పత్తిపాటి సాంబయ్యలు తెలిపారు. ప్రస్తుతం గతంలోని తెలుగుదేశం ప్రభుత్వం నిధులు కేటాయించి కొంత పనులు జరిగాయని, ప్రస్తుతం మరల చెట్లు పడి నీరు రాక ఇబ్బందిగా ఉందన్నారు. ఈ చెరువుకు ప్రభుత్వం నిధులు కేటాయించి చెరువులోకి నీళ్లు వచ్చే విధంగా ఛానల్‌ను ఏర్పాటు చేసి చెరువుకు మరమ్మతులు చేస్తే ఆ చెరువుకు ఎప్పుడు పుష్కలంగా నీరు ఉంటాయని వారు తెలిపారు. చెరువు నిండితే వెంకటాచలంపల్లి, నడింపల్లికి భూమి లోపల నీరు ఉండి బోర్లు బాగా పని చేస్తాయని వారు తెలిపారు. అదేవిధంగా ఆ నీటి ద్వారా సుమారుగా 200 ఎకరాల నుండి 300 ఎకరాల వరకు మెట్టపైర్లకు ఇంజన్ల ద్వారా నీరు పెట్టుకునే అవకాశాలు ఉన్నట్లు సుబ్బారావు, అనంత కృష్ణయ్య, సాంబయ్యలు తెలిపారు. ప్రభుత్వము లేదా ప్రజాప్రతినిధులు, అధికారులు స్పందించి నిధులు కేటాయించి తమ చెరువుకు నీరు వచ్చే విధంగా చర్యలు తీసుకుంటే వర్షాలు పడినప్పుడు చెరువులోకి నీళ్లు వస్తాయని చెరువు అభివృద్ధి కోసం నిధులు కేటాయించాలని వారు కోరుతున్నారు.

ఉపాధ్యాయురాలు గుంటక రామలక్ష్మమ్మకు సన్మానం



గుంటక రామలక్షమ్మ, కోటపాటి నారాయణను సన్మానిస్తున్న దశ్యం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ఉపాధ్యాయురాలు గుంటక రామలక్ష్మమ్మను ఆదివారం ఘనంగా సత్కరించారు. ఈ నెలాఖరున ఉద్యోగ విరమణ చేయుచున్న సందర్భంగా ఆదివారం శింగరాయకొండలోని గంజి వారి కళ్యాణ మండపంలో సన్మాన సభ నిర్వహించారు. ప్రస్తుతం నెల్లూరు జిల్లా కందుకూరులోని జనార్ధన కాలనీలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో ఎల్‌ఎఫ్‌ఎల్ ప్రధానోపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు. ఆదివారం శింగరాయకొండ గంజి వారి కళ్యాణ మండపంలో ఏర్పాటు చేసిన ఈ కార్యక్రమానికి ప్రకాశం నెల్లూరు జిల్లాల ఉపాధ్యాయులు భారీగా హాజరై రామలక్షమ్మ ఉపాధ్యాయులుగా చేసిన సేవలు గురించి ఈ సందర్భంగా కొనియాడారు. 43 సంవత్సరాలుగా ఉపాధ్యాయుల వృత్తిలో ఉండి ఎంతోమంది విద్యార్థులను తీర్చిదిద్దడం జరిగిందని కొనియాడారు. కందుకూరు యుటిఎఫ్ నాయకులు ముప్పరాజు కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. అదేవిధంగా జిల్లా విద్యాశాఖ డిసిబి చైర్మన్ మర్రి శ్రీనివాసరావు హాజరై రామలక్ష్మమ్మ ఉపాధ్యాయులుగా చేసిన సేవలను కొనియాడారు. అనంతరం మానవతా సంస్థ ఆధ్వర్యంలో ఉపాధ్యాయురాలు గుంటక రామలక్ష్మమ్మ, రిటైర్డ్ ప్రధానోపాధ్యాయులు కోటపాటి నారాయణ ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమానికి సభాధ్యక్షులుగా ఎం.నరసింహారావు వహించారు. ఈ కార్యక్రమంలో ఎంఈఓలు సుబ్బారెడ్డి, తన్నీరు హరిబాబు, న్యాయవాది బక్కమంతల వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.



నూతనంగా ఎన్నికైన ట్రెజరీ అసోసియేషన్ కార్యవర్గం

ట్రెజరీ అసోసియేషన్ కార్యవర్గ ఎన్నిక

జిల్లా అధ్యక్ష, కార్యదర్శులుగా ఎన్‌వి కృష్ణ, అంకబాబు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా ఎన్నికలు ఒంగోలు ఫైనాన్సియల్ కాంప్లెక్స్‌లో ఆదివారం జరిగాయి. ఈ ఎన్నికలకు నెల్లూరు జిల్లా ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ అధ్యక్షుడు పి. కిరణ్ కుమార్ వ్యవహరించగా, జిల్లా ఎన్నిక ఏకగ్రీవమైంది. జిల్లా అధ్యక్షులుగా యన్‌వి.కష్ణ (మార్కాపురం సబ్ ట్రెజరీ అధికారి), కార్యదర్శిగా పి.అంకబాబు (జిల్లా ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్) సహాధ్యక్షులుగా పివియల్‌యన్ వరకుమార్ (గిద్దలూరు సబ్ ట్రెజరీ అధికారి), మహిళా ఉపాధ్యక్షురాలుగా కె లావణ్య (జిల్లా ట్రెజరీ సీనియర్ అకౌంటెంట్), ఉపాధ్యక్షులుగా బి అక్కేశ్వర రావు (ఒంగోలు సబ్ ట్రెజరీ), యస్ కె కరిముల్లా, కె వెంకటేశ్వర్లు, మహిళా సంయుక్త కార్యదర్శులుగా పి.హేమలత, సంయుక్త కార్యదర్శులుగా కె ప్రసాద్ చంద్ర, డి అనిల్, కోశాధికారిగా కె.రామకష్ణ ఎన్నికయ్యారు. రాష్ట్ర కౌన్సిల్ సభ్యులుగా సిహెచ్ ఫణీంద్ర, ఐ.కిషోర్‌బాబు ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. ఎన్నికలకు అధికారిగా సిహెచ్.విజయకష్ణ, పరిశీలకులుగా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి డి.రమణారెడ్డి, రాష్ట్ర నాయకులు పాముల శ్రీనివాసరావు వ్యవహరించారు. ఆంధ్రప్రదేశ్ ట్రెజరీ సర్వీసెస్ అసోసియేషన్ ప్రకాశం జిల్లా కొత్త కార్యవర్గాన్ని ఎపియన్‌జిఓ అసోసియేషన్ ప్రకాశం జిల్లా అధ్యక్షులు కె.శరత్‌బాబు, కార్యదర్శి కృష్ణారెడ్డి అభినందించారు.

బస్సు ఢీకొని మహిళ మృతి

ప్రజాశక్తి-శింగరాయకొండ

శింగరాయకొండ ఆర్టీసీ బస్టాండ్ సమీపంలోని మలుపు తిరిగే ప్రాంతంలో ఆర్టీసీ బస్సు ఢీకొని ఢీకొని గుర్తు తెలియని మహిళ మృతి చెందిన సంఘటన చోటుచేసుకుంది. ఆదివారం తెల్లవారుజామున రెండు నుంచి మూడు గంటల లోపు ప్రాంతంలో ఆర్టీసీ బస్సు విజయవాడ నుంచి నెల్లూరుకు వెళ్లుతుండగా మలుపు వద్ద మహిళను ఢీకొంది. దీంతో ఆ మహిళ అక్కడికక్కడే మృతి చెందింది. మృతురాలికి 75 సంవత్సరాలు ఉండొచ్చని పోలీసులు తెలిపారు. ఘటనా స్థలాన్ని పోలీసులు పరిశీలించి మహిళను కందుకూరు ఏరియా వైద్యశాలకు తరలించారు. ఆర్టీసీ బస్సును పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అయితే బస్టాండు లోపికి బస్సులు వెళ్లే మార్గంలో రోడ్డు ఆక్రమణలకు గురవడంతోనే ఇరుకు రోడ్డులో ప్రమాదాలు జరిగే అవకాశం ఉండగా ఈ క్రమంలోనే గుర్తు తెలియని మహిళ మృతి చెందిందని స్థానికులు భావిస్తున్నారు. పంచాయతీ అధికారులు, పోలీసులు జోక్యం చేసుకొని ఆర్టీసీ బస్టాండుకు బస్సులు వచ్చే దగ్గర, పోయే దగ్గర ఆక్రమణలను తొలగించాలని కోరుతున్నారు.

పొగాకు బ్యారన్ దగ్ధం


సుమారు రూ.5 లక్షల ఆస్తి నష్టం

ప్రజాశక్తి-కొనకనమిట్ల

కొనకనమిట్ల మండలంలోని వద్దిమడుగులో అంకిరెడ్డి చెంచమ్మకు చెందిన పొగాకు బ్యారన్ ఏరువా తిరుపతయ్యకు లైసెన్స లీజ్‌కి ఇచ్చారు. ఆదివారం ఉదయం ఎప్పటిలాగే పొగాకు క్యూరింగ్ జరుగుతున్న సమయంలో మొద్దు గొట్టంపై కర్ర జారి పడటంతో అకస్మాత్తుగా మంటలు వ్యాపించాయి. చుట్టుపక్కల ఉన్న ప్రజలు హుటాహుటిన మండల ఆర్పేం దుకు ప్రయత్నించినా ఫలితం దక్కకపోవడంతో మార్కాపురం అగ్నిమాపక కేంద్రంకు ఫోన్ చేశారు. హుటాహుటిన అగ్నిక కేంద్రం సిబ్బంది ఫైరింజన్‌తో వచ్చి మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. బ్యారన్ యజమాని అంకిరెడ్డి చెంచమ్మ లీజుకు తీసుకున్న ఎరువ తిరుపతయ్య ఇరువురు రైతులు మాట్లాడుతూ సుమారు ఐదులక్షల రూపాయలు నష్టం వాటిల్లిందని పొగాకు బోర్డు వారిని సంప్రదించగా మీకు ఇన్సూరెన్స్ లేదు, నష్టపరిహారం రాదని చెప్పారన్నారు. మమ్మల్ని ప్రభుత్వమే ఆదుకొని నష్టపరిహారం అందేలాగా చూడాలని రైతులు వేడుకుంటున్నారు.



దగ్ధమవుతున్న బ్యారన్



బోల్తా పడిన లారీ

లారీ బోల్తా.. నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దారవీడు

నెల్లూరు నుంచి హైదరాబాద్ సజ్జల లోడుతో వెళుతున్న లారీ ముందు టైరు పంచర్ కావడంతో అదుపు తప్పి బోల్తా పడింది. ఈ ప్రమాదంలో డ్రైవర్, క్లీనర్‌తో పాటు ఇద్దరు రైతులు స్వల్ప గాయాలతో బయటపడ్డారు. ఈ ప్రమాదం పెద్దారవీడు మండలంలోని తోకపల్లి సమీపంలో జాతీయ రహదారి 565పై ఆదివారం జరిగింది. పెద్దారవీడు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

బ్యూటీషియన్‌లో ఉచిత శిక్షణ

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరిలోని ఐడియల్ కంప్యూటర్స్ అండ్ బృందావన్ ఫంక్షన్ హాల్‌లోని వనిత ట్రైనింగ్ సెంటర్లో మహిళలకు ఉచిత బ్యూటిషన్ మరియు వ్యాపార నిర్వహణ శిక్షణ ఇవ్వటం జరుగుతుందని ట్రైనింగ్ సెంటర్ డైరెక్టర్ బి.సుమ ఆదివారం తెలిపారు. 18 నుంచి 58 ఏళ్లలోపు వయసున్న మహిళలు అర్హులు అన్నారు. 30 రోజుల శిక్షణ అనంతరం గవర్నమెంట్ సర్టిఫికెట్ అందజేస్తామని తెలిపారు. ఈ సర్టిఫికెట్‌తో బ్యాంకు రుణాలు పొందవచ్చని తెలిపారు. పూర్తి వివరాలకు 9441126340 నెంబరులో సంప్రదించాలని కోరారు.

ముగిసిన తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు

- ఉత్తమ ప్రదర్శనగా 'కపిరాజు'
- ద్వితీయ ఉత్తమ ప్రదర్శనగా 'స్వేచ్ఛ'
- తృతీయ స్థానంలో 'ఋతువు లేని కాలం'



కళాకారులకు బహుమతులు అందిస్తున్న శ్రీకారం చైర్మన్ మోహనరావు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

పాత కాలం నాటి ఆచారాలు, సంప్రదాయాలు, జీవన విధానాలు అంతరించి పోకుండా భావితరాలకు అందించడానికి శ్రీకారం, రోటరీ కళా పరిషత్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 15వ తెలుగు రాష్ట్రాల నాటిక పోటీలు వీక్షకులను ఆలోచింపచేశాయి. 3రోజుల పాటు నిర్వహించిన జాతీయ స్థాయి నాటికల పోటీలు శనివారం అర్ధరాత్రితో ముగిసాయి. పోటీల్లో విజయవాడ న్యూ స్టార్ మోడరన్ థియేటర్ సమర్పణలో డాక్టర్ ఎంఎస్ చౌదరి రచించి, దర్శకత్వం వహించిన 'కపిరాజు' నాటిక ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైంది. ఉత్తమ ద్వితీయ స్థానంలో హైదరాబాద్ విశ్వశాంతి కల్చరల్ అసోసియేషన్ సమర్పణలో బిఎం రెడ్డి దర్శకత్వంలో పి శివరాం రచించిన 'స్వేచ్ఛ', తృతీయ స్థానంలో వీరన్నపాలెం కళానికేతన్ ఆధ్వర్యంలో వై బుచ్చయ్య చౌదరి దర్శకత్వంలో ఆగస్త్య రచించిన 'ఋతువు లేని కాలం', ప్రత్యేక ప్రదర్శనగా విజయవాడ మైత్రి కళానిలయం సమర్పణలో టివి పురుషోత్తం దర్శకత్వం వహించిన 'బ్రహ్మస్వరూపం' నాటికలను న్యాయనిర్ణేతలు అన్నమనేని ప్రసాద్, అంబటి మురళీ కృష్ణ ఎన్ రవీంద్రారెడ్డి, కెవి మంగారావు ఎంపికచేశారు.

ఉత్తమ నటులు వీరే

ఉత్తమ నటుడిగా స్వేచ్ఛ నాటికలో ఆనంద్ పాత్రధారి గోవాడ వెంకట్, ఉత్తమ సహాయ నటుడిగా కపిరాజు నాటికలో వాలి పాత్రధారి పవన్ కళ్యాణ్, ఉత్తమ క్యారక్టర్ యాక్టర్‌గా 'ఆసత్యం' నాటికలో శివయ్య పాత్రధారి పి బాలాజీ నాయక్ ఎంపికయ్యారు. ఉత్తమ నటిగా 27వ మైలు రాయి నాటికలో వైదేహి పాత్రధారి సురభి ప్రభావతి, ఉత్తమ హాస్య నటుడుగా ఋతువులేని కాలం నాటికలో డాక్టర్ పాల్‌గా నటించిన సురేంద్ర బాబు, ఉత్తమ విలన్‌గా జనరల్ బోగీలు నాటికలో సర్కిల్ ఇన్స్‌పెక్టర్‌గా నటించిన గోపరాజు విజయ్ ఎంపికయ్యారు.

ఉత్తమ దర్శకుడు

ఉత్తమ దర్శకుడిగా ఎంఎస్ చౌదరి (కపిరాజు నాటిక), ఉత్తమ రచయిత ఆగస్త్య (ఋతువులేని కాలం) ప్రత్యేక బహుమతులను కపిరాజు, 27వ మైలు రాయి, ఋతువులేని కాలం, స్వేచ్ఛ నాటికల పాత్రధారులు దిలీప్, కిరణ్, సురభి పూజిత, మంజు భార్గవిలను న్యాయనిర్ణేతలు ఎంపిక చేశారు. విజేతలకు శ్రీకారం, రోటరీ కన్వీనర్, ఎఫర్ట్ సంస్థ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ జాష్టి వెంకట మోహనరావు, శ్రీకారం కార్యదర్శి జాష్టి అనురాధ, రోటరీ అధ్యక్ష, కార్యదర్శులు మద్దుమాల కోటేశ్వరరావు, మాదాల సాంబశివరావు, రోటరీ ఆంధ్రా రీజియన్ చైర్మన్ ఎం ఈశ్వరప్రసాద్, రోటరీ సభ్యులు బహుమతులను అందజేశారు. ఈ నాటిక పోటీల్లో పాల్గొన్న ప్రతి కళాకారునికి శ్రీకారం, రోటరీ కళాపరిషత్ ఆధ్వర్యంలో నగదు బహుమతి అందించారు. నాటికల పోటీలు విజయవంతం చేసిన కళాకారులు, కళాభిమానులకు శ్రీకారం కన్వీనర్ జాష్టి మోహనరావు అభినందనలు తెలిపారు.



కళాకారులకు బహుమతులు అందిస్తున్న శ్రీకారం చైర్మన్ మోహనరావు



ఉత్తమ ప్రదర్శనగా ఎంపికైన కపిరాజు నాటిక దృశ్యం



మాట్లాడుతున్న రావుల బాపయ్య చౌదరి

సర్వీస్ రూల్స్ సవరణ చట్టాన్ని రద్దు చేయాలి

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

విశ్రాంత ఉద్యోగుల ప్రయోజనాలు దెబ్బతీసేలా కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన సివిల్ సర్వీస్ రూల్స్ 1972 సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేయాలని విశ్రాంత ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు రావుల బాపయ్య చౌదరి డిమాండ్ చేశారు. స్థానిక పెన్షనర్స్ భవన్ లో మార్టూరు యూనిట్ సంఘ అధ్యక్ష, కార్యదర్శులు కె రామారావు, ఎంఎస్ చిట్టిబాబు అధ్యక్షతన ఆదివారం జరిగిన సర్వసభ్య సమావేశంలో ఆయన మాట్లాడారు. విశ్రాంత ఉద్యోగుల పట్ల ప్రభుత్వాలు వివక్ష చూపించడం సరికాదని తెలిపారు. సీనియర్ విశ్రాంత ఉద్యోగులకు తీవ్ర నష్టం కలిగించే సివిల్ సర్వీస్ రూల్స్ సవరణ చట్టాన్ని వెంటనే రద్దు చేసేలా ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎం పిచ్చయ్యశర్మ, కె లక్ష్మయ్య, వీరయ్య, పిఎస్ఆర్ కోటేశ్వరరావు, ఎం కోటేశ్వరరావు, అంకయ్య, వెంకటేశ్వర్లు, రాజేంద్రబాబు పాల్గొన్నారు.




పుస్తకాలు పంపిణీ చేస్తున్న గీతా, రోటరీ ప్రతినిధులు

విద్యా సామగ్రి పంపిణీ

ప్రజాశక్తి - చీరాల

స్థానిక రోటరీ కమ్యూనిటి హాలులో గీతా యంగ్ సైంటిస్ట్, రోటరీ క్లబ్ సంయుక్తంగా వస్తు మార్పిడి కార్యక్రమం ఆదివారం నిర్వహించారు. విద్యార్థుల పాత పుస్తకాలు, న్యూస్ పేపర్స్, ప్లాస్టిక్ వస్తువులు 1800 కెజీలు 130 మంది విద్యార్థుల దగ్గర సేకరించారు. దానికి సమానంగా నూతన విద్యా సంవత్సరంకు ఉపయోగపడే రూ.21వేల విలువైన నోట్ బుక్స్, పెన్నులు, పెన్సిల్లు, స్కేల్స్, జామెంటరీ బాక్సులు పంపిణీ చేశారు. 50కేజీలపైగా పాత పుస్తకాలు తెచ్చిన వారికి బహుమతులు అందజేసినట్లు తెలిపారు. వలివేటి మురళీకృష్ణ, సిహెచ్ బాల వెంకటేశ్వరరావు, పోలుదాసు రామకృష్ణ, గీతా సంస్థ కిరణ్, పద్మ, సుధ, నవీన, రీఫాత్, బాజీ, గుర్రం రాఘవరావు, జాలాది కృష్ణ, డాక్టర్ ఐ బాబూరావు, చీరాల కృష్ణమూర్తి, చారగుళ్ళ గురుప్రసాద్, జివై ప్రసాద్, డివి సురేష్ పాల్గొన్నారు.



రాతి మండపం నిర్మాణానికి విరాళం అందజేస్తున్న దాతలు

రాతి మండపం నిర్మాణానికి విరాళం

ప్రజాశక్తి - అద్దంకి

సింగరకొండ ప్రసన్నాంజనేయ స్వామి దేవస్థానం రాతి ముఖ మండపం నిర్మాణానికి పట్టణానికి చెందిన దూళిపాళ్ల రామచంద్ర ప్రసాద్, నాగేశ్వరి దంపతులు రూ.1,00,116 దేవస్థానం సహాయ కమిషనర్, కార్య నిర్వహణ అధికారి మదమంచి తిమ్మనాయుడుకు చెక్కు రూపంలో ఆదివారం అందించారు. కాకానిపాలెం చెందిన కాకాని హనుమంతరావు జ్ఞాపకార్థం కుటుంబ సభ్యులు రూ.1,01,116 అందించారు. కార్యక్రమంలో ఆలయ అర్చకులు పాల్గొన్నారు.

ఆ ఫిర్యాదులో వాస్తవాలు లేవు..

యుటిఎఫ్

ప్రజాశక్తి - వేటపాలెం

మండలంలోని ఓఆర్ఎస్ పాఠశాల్లో పనిచేస్తున్న యుటిఎఫ్ మండల అధ్యక్షుడు పింజల శ్రీనివాస రావుపై డిఎంహెచ్ఒకు ఈనెల 12న చేసిన ఫిర్యాదులో ఎలాంటి వాస్తవాలు లేవని యుటిఎఫ్ గౌరవాధ్యక్షులు శిద్ధం పాపారావు, యుటిఎఫ్ జిల్లా సహాధ్యక్షులు బండి బిక్షాలుబాబు పేర్కొన్నారు. ఫిర్యాదు చేసిన వ్యక్తికి ఉపాధ్యాయుని ఎస్ఆర్ కాపీ నకలు ఎలా వచ్చిందో ఎంఇఒ తెలియజేయాలని, గోప్యంగా ఉండాల్సిన ఉద్యోగుల సర్వీసు రికార్డుల సమాచారం బయటికి రావడంలో ఎంఈఓపై విచారణ చేయాలని డిమాండ్ చేశారు. ఎస్ఆర్ సమాచారం ఎంఈఓ1నే ఇస్తున్నారా? లేక ఆఫీసులో వ్యక్తుల ద్వారా బయటకు వెళ్లిందా? అని ప్రశ్నించారు. కొంత మంది ఉపాధ్యాయులు స్కూళ్లకు వెళ్లకుండా ఎంఇఒ ఆఫీసులో ఉంటూ కొంతమంది ఉపాధ్యాయులను టార్గెట్గా చేసుకుని పని చేస్తున్నారని అన్నారు. ఈ విషయంలో ఎంఈఓపై చర్యలు కోరుతూ చట్టపరంగా పోరాడుతామని పేర్కొన్నారు. దీనికి పూర్తి బాధ్యత ఎంఈఓ వహించాల్సి ఉందని అన్నారు. ఉన్నత అధికారులకు ఈ విషయమై ఫిర్యాదు చేస్తామని యుటిఎఫ్ జిల్లా కార్యదర్శి పాలేటి సురేష్, సీతారామరాజు, కుర్ర శ్రీనివాసరావు హెచ్చరించారు. ఈ విషయమై ఎంఆర్‌సి వద్ద పెద్ద ఎత్తున సోమవారం ధర్నా నిర్వహించనున్నట్లు తెలిపారు.

నాటక రంగానికి పూర్వ వైభవం రావాలి

సినీ రచయిత పరుచూరి వెంకటేశ్వరరావు

ప్రజాశక్తి - భట్టిప్రోలు

నాటక రంగానికి పూర్వ వైభవం తెచ్చేందుకు తమ వంతు కృషి చేస్తున్నట్లు సినీ రచయిత, నటుడు పరుచూరి వెంకటేశ్వరరావు అన్నారు. పరుచూరి రఘు బాబు మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో పరుచూరి రఘు బాబు స్మారక 35వ జాతీయ స్థాయి నాటకాల పోటీలు మండలంలోని పల్లికోన గ్రామంలో ఆదివారం ఎన్‌టిఆర్ కళా ప్రాంగణంలో ప్రారంభించారు. సభకు పరుచూరి వెంకటేశ్వరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తన కుమారుడు పల్లికోన గ్రామంలో నడియాడారని, అతను అకాల మరణం చెందడంతో అతను నడయాడిన పల్లికోనలో ఆడిటోరియం నిర్మించడం ద్వారా రఘుబాబు జీవించే ఉన్నారని, రంగ స్థలం కళాకారులతో నాటకాలు, నాటికలు ప్రతి ఏటా ప్రదర్శిస్తున్నట్లు తెలిపారు. సినీనటి శివపార్వతి మాట్లాడుతూ పరుచూరి రఘుబాబు రంగ స్థలం కళాకారుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచారని అన్నారు. తమ గురువులు పరుచూరి బ్రదర్స్ ఏర్పాటు చేసిన ఈ నాటకోత్సవాల్లో తనకు ప్రదర్శించేందుకు అవకాశం కల్పించి అనంతరం సినీ రంగానికి పరిచయం చేసిన మహోన్నత వ్యక్తులని అన్నారు. తన లాంటి ఎంతోమంది కళాకారులకు చేయూతనిచ్చిన మహానుభావులు పరుచూరి బ్రదర్స్ అన్నారు. తెలుగు ప్రముఖ రచయిత బుర్ర మాధవ్ మాట్లాడుతూ నాటక కళలను గ్రామీణ ప్రాంత ప్రజలు ఆదరించాలని కోరారు. అనేక వ్యయ ప్రయాసలకు ఓర్చి పెద్ద వయసులో కూడా ఈ నాటక రంగానికి జీవం పోస్తున్న పరుచూరి వెంకటేశ్వరరావు అభినందనీయులని అన్నారు. హైదరాబాదు నుండి నటీ, నటులను ఈ ప్రాంతానికి తీసుకువచ్చి కళా రగంపై మక్కువ కల్పించేందుకు పరుచూరి చేస్తున్న కృషి ఎనలేనిదని అన్నారు. తొలుత సభ ప్రారంభానికి జ్యోతి ప్రజ్వలన శివపార్వతి గావించారు. కార్యక్రమంలో సినీ నటుడు సుబ్బరాయ శర్మ, వ్యాఖ్యాత అయినాల మల్లేశ్వరరావు, సినీ హీరో పరుచూరి సుదర్శన్, వేజెండ్ల బసవ పున్నారవు (పెద్దబ్బాయి), వేజెండ్ల శివరాం ప్రసాద్, వేజెండ్ల సాంబశివరావు, మండవ రామకోటేశ్వరరావు, రాయల ప్రసాద్ పాల్గొన్నారు.



నాటకోత్సవాల ప్రారంభ సభలో వెంకటేశ్వరరావు



చెరువు అభివృద్ధి పనులు ప్రారంభిస్తున్న దృశ్యం

చెరువు అభివృద్ధి పనులు ప్రారంభం

ప్రజాశక్తి - యద్దనపూడి

మండలంలోని అనంతవరం త్రాగు నీటి చెరువు అభివృద్ధి పనులను ఆదివారం ప్రారంభించారు. బాల వికాస సాంఘిక సేవ సంస్థ ఆధ్వర్యంలో ఫిలిప్ మొర్రీస్ ఇంటర్నేషనల్, గాడ్ఫ్రియ్ ఫిలిప్స్ ఇండియా లిమిటెడ్ సహకారంతో పనులు చేస్తున్నారు. ఎఫర్ట్ సంస్థ ఎండి మోహనరావు, పిఐ మేనేజర్ ఉమా మహేష్ మాట్లతూ విచ్చల విడిగా ఎరువులు వాడటం వల్ల భూసారం దెబ్బతిని రైతులు ఆశించిన దిగుబడులు రావటం లేదని అన్నారు. పూడిక మట్టిని పొలాల్లో వేయటం వలన చాల లాభాలు ఉన్నాయని అన్నారు. పూడిక మట్టి తీత వల్ల చెరువు లోతు పెరుగుతుందని, దీని వల్ల నీటి నిల్వ సామర్థ్యం పెరుగుతుందని అన్నారు. పూడిక మట్టిని పంట పొలాల్లో వేసుకోవటం వల్ల పంటకు కావలసిన పోషకాలు లభిస్తాయని అన్నారు. అంతే కాకుండా భూమిలో తేమ శాతం పెరుగుతుందని అన్నారు. భూసారం, పంట దిగుబడి పెరుగుతుందని తెలిపారు. రైతుకు పెట్టుబడి భారం తగ్గుతుందని అన్నారు. ఒక్కసారి పూడిక మట్టిని పొలంలో వేసినట్లయితే దాని ప్రతిఫలం నాలుగేళ్ల పాటు ఉంటుందని అన్నారు, బాల వికాస సంస్థ రైతులకు ఉచితంగా ప్రోక్లైన్‌తో పూడిక మట్టి తరలిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో బుర్ర విక్రమ్, రాజు కుమార్, తారక రామారావు, కొరిటాల వంశీ కృష్ణ, పోపూరి వెంకట్రావు, పోపూరి సాంబశివరావు, నిమ్మల సాంబశివరావు , పెడవల్లి వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

కిశోర వికాసంపై నేడు సమావేశం

ప్రజాశక్తి - యద్దనపూడి

స్థానిక ఎంపిడిఒ కార్యాలయం నందు కిషోర్ వికాసం స్పెషల్ క్యాంపేయిన్‌పై సోమవారం మధ్యాహ్నం సమావేశం జరుగుతుందని ఎంపిడిఒ లక్ష్మినారాయణ తెలిపారు. సమావేశంలో సిడిపిఒ, సూపర్వైజర్లు, మహిళా పోలీసులు పాల్గొనాలని కోరారు. మే 2నుంచి జూన్ 10వరకు 15 నుంచి 18ఏళ్ల పిల్లలను సమూహాలుగా ఏర్పాటు చేసి రోజుకు ఒక టీం ప్రకారం శిక్షణ ఇవ్వనున్నట్లు తెలిపారు.



జయంతిబాబుకు బీపీ చెక్ చేస్తున్న డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు

200 మందికి ఉచితంగా వైద్యపరీక్షలు

ప్రజాశక్తి-టంగుటూరు

టంగుటూరులో మక్కెన కృష్ణారావు చారిటబుల్ ట్రస్టు ఆద్వర్యంలో బెల్లం కోటయ్య వాకింగ్ ట్రాక్ దగ్గర సిమ్స్ హాస్పిటల్ ఆధ్వర్యంలో ఆదివారం ఉచిత మెడికల్ క్యాంపు నిర్వహించారు. ఈ మెడికల్ క్యాంపులో సీనియర్ వైద్యులు డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు వైద్యసేవలందించారు. 200 మంది రోగులకు బి.పి, షుగర్ పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ అనపర్తి శ్రీనివాసరావు మాట్లాడుతూ షుగర్, బిపి ఉన్న వారు తీసుకోవలసిన ఆహారం, జాగ్రత్తల గురించి వివరించారు. షుగరు, బిపి రోగులు తన వైద్యశాలలో తక్కువ ఖర్చుతో వైద్యం అందిస్తామని తెలిపారు. వైద్యశిబిరంలో టంగుటూరు మాజీ సర్పంచి బెల్లం జయంతిబాబు, మక్కెన హరిబాబు, మక్కెన కోటేశ్వరరావు, కుందేటి వెంకటరావు, ఉమామహేశ్వరరావు, ఉన్నం పెద్దబ్బాయి, గ్రామస్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలి

ప్రజాశక్తి-టంగుటూరు

విద్యార్థులలో విజ్ఞానం పెంచేందుకు, సృజనాత్మకతను వెలికితీసేందుకు వేసవి విజ్ఞాన శిబిరాన్ని సద్వినియోగం చేసుకోవాలని టంగుటూరు గ్రంథపాలకులు గుమ్మడి వర్ధనరాజు తెలిపారు. టంగుటూరు శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరం జూన్ ఆరో తేదీ వరకు కొనసాగుతుందని గ్రంథపాలకులు తెలిపారు. ఆదివారం నాడు గ్రంథాలయంలో చదవటం నాకిష్టం కార్యక్రమం నిర్వహించారు.



మాట్లాడుతున్న మల్లేశ్వరరావు

యుటిఎఫ్ శిక్షణా తరగతులు

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

యుటిఎఫ్ రాష్ట్ర సంఘం పిలుపుమేరకు ప్రకాశం జిల్లా శాఖ రెండు రోజులు శిక్షణ తరగతులు ఈనెల 26, 27 తేదీల్లో ఒంగోలు పేస్ ఇంజనీరింగ్ కళాశాలలో విజయవంతంగా ముగిశాయి. మొదటి రోజు శిక్షణ తరగతులను రాష్ట్ర గౌరవాధ్యక్షులు కె శ్రీనివాసరావు ప్రారంభించారు. మొదటి రోజు క్లాస్‌ను యుటిఎఫ్ భావజాలాన్ని రాష్ట్ర సహాధ్యక్షులు కె.సురేష్ కుమార్ బోధించారు. రెండవ క్లాసును విద్యారంగ పరిణామాలను ఎన్. నవ కోటేశ్వరరావు బోధించారు. మూడవ క్లాసు నిర్మాణాలను కర్తవ్యాలను కె శ్రీనివాసరావు, ఆడిట్ రికార్డు నిర్వహణ ఎన్.చిన్న స్వామి, ఎం రాము అవగాహన కల్పించారు. రెండవ రోజు పెన్షన్ రూల్స్ ను జె.కేశవరాజు, లీవ్ రూల్స్‌ను రాష్ట్ర నాయకులు టిఎస్ఎల్ఎన్ మల్లేశ్వరరావు ,బదిలీల చట్టం నిబంధనను ఎస్ రవి, సిపిఎస్ పెన్షన్, జెడ్పి పిఎఫ్ లోన్స్, మెడికల్ బిల్స్ పై ఎస్కె అబ్దుల్ హై, వర్తమాన రాజకీయాలను డి వీరాంజనేయులు, మహిళా ఉద్యమం జి ఉమామహేశ్వరి బోధించారు. శిక్షణ తరగతులకు జిల్లా నలుమూలల నుండి 200 మంది యుటిఎఫ్ కార్యకర్తలు పాల్గొని విజయవంతం చేశారు ఈ శిక్షణ తరగతులను పర్యవేక్షణ సీనియర్ నాయకులు వెంకటేశ్వర్ రెడ్డి, జి శేషయ్య పర్యవేక్షించారు. చివరగా యుటిఎఫ్ జిల్లా కర్తవ్యాలను జిల్లా ప్రధాన కార్యదర్శి డి వీరాంజనేయులు, బోధిస్తూ మే రెండవ తేదీ డి రామిరెడ్డి 9వ వర్ధంతి సభ స్మారక ఉప న్యాసం దర్శిలో జరుగుతుందని 40 మండలాల నుండి కార్యకర్తలు భారీగా హాజరై జయప్రదం చేయాలని కోరారు.

'నల్లబర్లీ' కొనుగోలుకు చర్యలు తీసుకోవాలి

మంత్రి స్వామిని కోరిన రైతుసంఘం నేతలు

ప్రజాశక్తి-టంగుటూరు

నల్లబర్లీ పొగాకు కొనుగోలుకు జోక్యం చేసుకోవాలని రాష్ట్ర సాంఘిక, సంక్షేమ శాఖ మంత్రి డాక్టర్ డోలా బాల వీరాంజనేయస్వామికి రైతు సంఘాల నేతలు విజ్ఞప్తి చేశారు. ఆదివారం నాడు సంయుక్త కిసాన్ మోర్చా జిల్లా కన్వీనర్ చుండూరు రంగారావు నేతృత్వంలో రైతుసంఘం జిల్లా అధ్యక్షులు జుజ్జూరి జయంతి బాబు, నల్లమడ రైతుసంఘం నాయకులు కొల్లా రాజమోహన్ టంగుటూరులోని మంత్రి క్యాంపు కార్యాలయంలో కలసి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పొగాకు రైతుకు గిట్టుబాటు ధర కల్పించే విధంగా ప్రభుత్వంపై ఒత్తిడి తేవాలని కోరారు. గత సంవత్సరం బర్లీ పొగాకుకు మంచి ధర లభించడం, కంపెనీల ప్రతినిధులు ప్రోత్సహించడంతో రైతాంగం విస్తారంగా బర్లీ పొగాకు సాగు చేశారన్నారు. మంచి ధర లభిస్తుందన్న ఆశతో అప్పులు చేసి మరీ సాగు చేశారని తెలిపారు. ప్రస్తుతం పొగాకు ధరలు పడిపోవడంతో తీవ్ర ఆవేదన చెందుతున్నారని పేర్కొన్నారు. కంపెనీలు ఏజెంట్ల ద్వారా అతి తక్కువకు కొనాలని చూస్తున్నట్లు చెప్పారు.. గత ఏడాది క్వింటా రూ.15 వేల నుండి 18 వేల వరకు అమ్మిన పొగాకు నేడు నాలుగు వేల నుండి రూ.ఐదు వేలకు అడుగుతున్నారని తెలిపారు. కనీసం గత సంవత్సరం లాగా రూ.18 వేలకు కొనుగోలు చేయించాలని, కంపెనీలు కొనకపోతే ప్రభుత్వ సంస్థల ద్వారా కొనుగోలు చేయాలని కోరారు. బర్లీ పొగాకును బోర్డు పరిధిలో చేర్చాలని విజ్ఞప్తి చేశారు. ఈ విషయంపై మంత్రి స్వామి ఇప్పటికే ముఖ్యమంత్రి కార్యాలయ కార్యదర్శిని సంబంధిత సంబంధిత వ్యాపారులతో సమావేశం ఏర్పాటు చేయమని ఆదేశించారని తెలిపారు. ఈ సందర్భంగా తాను నల్లబర్లీ విషయంతో పాటు వర్జీనియా సిగరెట్ గురించి కూడా వేలం కేంద్రాలలో జరుగుతున్నటువంటి సమస్యలను కూడా ముఖ్యమంత్రి దృష్టికి తెచ్చానని చెప్పారు. ఆయన సానుకూలంగా స్పందించినట్లు మంత్రి స్వామి వారికి తెలిపారు.



మంత్రి స్వామికి అర్జీ ఇస్తున్న రైతుసంఘం నేతలు

మోడీకి ప్రజల కన్నా ఎన్నికలే మిన్న

- రాష్ట్రంలో అప్పులపై శ్వేతపత్రం విడుదల చేయాలి
- సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ



మాట్లాడుతున్న రామకృష్ణ

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

దేశంలో ప్రజల మానప్రాణాల కంటే, ప్రధాని మోడీకి ఎన్నికలే ముఖ్య మయ్యాయని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ ఆగ్రహం వ్యక్తం చేశారు. సిపిఐ 28వ రాష్ట్ర మహాసభల ఆహ్వాన కమిటీ ఏర్పాటు సమావేశం సందర్భంగా ఒంగోలులోని మల్లయ్య లింగం భవనంలో ఆదివారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో రామకష్ణ మాట్లాడారు. కాశ్మీర్లోని పహల్గాం ఉగ్ర వాదుల దమనకాండ ప్రతి పౌరుడూ ఖండించాల్సిన విషయమన్నారు. ఘటనపై కేంద్రం ఏర్పాటుచేసిన అఖిలపక్ష సమావేశానికి ప్రధాని మోడీ హాజరు కాకుండా బీహార్ ఎన్నికల సమావేశంలో పాల్గొనడం పట్ల ఆగ్రహం వ్యక్తం చేశారు. మోడీకి ప్రజల ప్రాణాల కంటే ఎన్నికలే ప్రధానమైన అంశంగా గుర్తించాలన్నారు. హోం శాఖ మంత్రి అమిత్ షా భద్రత లోపాల వైఫల్యాల కారణంగా ఘటన చేసుకుందని ప్రకటించడం సిగ్గుచేటన్నారు. ఈ ఘటనను మతాలకు, ముడిపెట్టి రాజకీయం చేసే ప్రయత్నాన్ని ప్రజలంతా తిప్పి కొట్టాలని సూచించారు. కాగా అలవి కాని హామీలతో అధికారం చేపట్టిన చంద్రబాబు నాయుడు రాష్ట్రాన్ని మరో 'శ్రీలంక'గా మారుస్తున్నారని దుయ్యబట్టారు. ప్రతిపక్ష నేతగా ఉన్నప్పుడు చంద్రబాబు జగన్‌పై రాష్ట్రాన్ని అప్పులు ఊబిలోకి నెడుతున్నారని ఆరోపించి.. తాను కూడా అదే బాటలో నడుస్తున్నారని విమర్శించారు. తెచ్చే అప్పులపై కూటమి ప్రభుత్వం శ్వేత పత్రం విడుదల చేయాలని డిమాండ్ చేశారు. 9 నెలల కాలంలో అప్పులు తప్ప రూపాయి నిధులు రాబట్టలేదన్నారు. కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలపై వామపక్ష, ప్రజాతంత్ర శక్తులను కూడగట్టి ఐక్య ఉద్యమాలు చేపట్టాలని పార్టీ కేంద్ర మహాసభలో నిర్ణయం జరిగిందన్నారు. రాష్ట్రంలో కార్యాచరణ సాధించేందుకు పార్టీ రాష్ట్ర 28వ రాష్ట్ర మహాసభలు తొలిసారి ఒంగోలులో ఆగస్టులో నిర్వహిస్తున్నామని, మహాసభలను జయప్రదం చేయాలని కోరారు. సమావేశంలో సిపిఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుజ్జుల ఈశ్వరయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రావులపల్లి రవీంద్రనాథ్, జిల్లా కార్యదర్శి ఎంఎల్ నారాయణ, జిల్లా కార్యవర్గ సభ్యులు ఆర్.వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఉచిత శిక్షణా తరగతులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఈ నెల 28 నుంచి జూన్ 6 వరకు ఆరో తరగతి నుండి పదో తరగతి వరకు విద్యార్థులకు ఉచితంగా వేసవి శిక్షణా తరగతులు నిర్వహించనున్నట్లు ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి తెలిపారు. ఒంగోలులోని జిల్లా కేంద్ర గ్రంథాలయంలో ఆదివారం నాడు చదవటం మాకిష్టం కార్యక్రమం ఉప గ్రంథపాలకురాలు బొమ్మల కోటేశ్వరి పర్యవేక్షణలో నిర్వహించారు. పిల్లలతో పుస్తక పఠనం చేయించారు. కోటేశ్వరి మాట్లాడుతూ ఈ శిక్షణా తరగతులలో స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్, క్యారమ్స్ మరియు వివిధ అంశాలు నేర్పించనున్నట్లు పేర్కొన్నారు. ఈ అంశాలలో విద్యార్థులకు ఉచితంగా శిక్షణ ఇవ్వటానికి స్వచ్ఛందంగా ఆసక్తి ఉన్న రిసోర్స్ పర్సన్స్ ముందుకు రావాలని కోరారు. క్యాంప్ జరిగినంత కాలం పిల్లలకు మజ్జిగ, స్నాక్స్, శీతల పానీయాలు అందించటంలో దాతలు ముందుకు వచ్చి సహకారం అందించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో గ్రంథాలయ సిబ్బంది పి.ఇమ్మానుయేలు, యస్.అనిల్‌బాబు, పి.దయామణి, లక్ష్మి పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

డి3 సెక్షన్ పరిధిలో సోమవారం ఉదయం 7 గంటల నుండి మధ్యాహ్నం ఒంటి గంట వరకు గాంధీనగర్, శివాజీనగ్, హరిహర నగర్, జెడ్ పి కాలనీ, మంగమూర్ డొంక, ప్రగతి నగర్, మర్రిచెట్టు కాలనీ, మిలటరీ కాలనీ తదితర ప్రాంతాలలో విద్యుత్ మరమ్మతుల కారణంగా విద్యుత్తు సరఫరాకు అంతరాయం ఉంటుందని ఒంగోలు టౌన్ డిఈఈ కెవి పాండురంగారావు ఒక ప్రకటనలో తెలిపారు. విద్యుత్ వినియోగదారులు గమనించి సహకరించాలని కోరారు.

– భాగ్యనగర్ నాలుగో లైన్‌లో ఉదయం 9 నుంచి 10.30 వరకు విద్యుత్ సరఫరా నిలిపేయనున్నట్లు డిఈఈ కెవి పాండురంగారావు తెలిపారు.

పేదలకు అన్నదానం

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ


పుట్టినరోజులను ఆర్భాటంగా చేసుకునే ఆనవాయితీ నుండి సేవా కార్యక్రమాలు వైపు దృష్టి సాగించడం అభినందనీయమని ఒంగోలు నగర అభివృద్ధి కమిటీ అధ్యక్షులు మారెళ్ళ సుబ్బారావు అన్నారు. ఆదివారం నాడు నగరంలోని గంగా శివాజీ, రాజ్యలక్ష్మిల కుమార్తె ఆద్య జన్మదినం సందర్భంగా ఇరువురు దంపతుల ఆధ్వర్యంలో ఒంగోలు సంతపేటలోని శివం శరణాలయంలో కేక్ కట్ చేసి పుట్టినరోజు వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా సుబ్బారావు మాట్లాడుతూ శివం పౌండేషన్ ఆధ్వర్యంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహించారని తెలిపారు.. ప్రతి ఒక్కరూ సేవా కార్యక్రమాల ద్వారా తమ పుట్టినరోజులను జరుపుకుంటే ఇంకొకరికి మేలు చేసినవారవుతారన్నారు. కార్యక్రమంలో శివం ఫౌండేషన్ చైర్మన్ గొల్లపూడి శ్రీహరి, మారెళ్ళ రాజేశ్వరి, ఆద్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా మాజీ మంత్రి సురేష్ జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-టంగుటూరు

మాజీ మంత్రి, వైసిపి కొండపి నియోజకవర్గ ఇన్‌ఛార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ జన్మదిన వేడుకలు ఆదివారం నాడు ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలలో జరుగుమల్లి వైసిపి మండల అధ్యక్షులు పిన్నిక శ్రీనివాసరావు పాల్గొని.. సురేష్‌కు గజమాల వేసి శుభాకాంక్షలు తెలిపారు. మాజీ మంత్రి సురేష్ భారీ కేక్ కట్ చేశారు. మిఠాయిలు పంచారు. సురేష్‌కు శుభాకాంక్షలు తెలిపిన వారిలో జరుగుమల్లి వైసిపి మాజీ అధ్యక్షులు బత్తిన మనోహర్, ప్రచార విభాగం జిల్లా అధ్యక్షులు కనపర్తి శేషారెడ్డి, కొండపి నియోజకవర్గ బూత్ కమిటీ అధ్యక్షులు కొమ్మాలపాటి మధు, చుండూరి సురేష్, జరుగుమల్లి సర్పంచి కసుకుర్తి పున్నారావు, జరుగుమల్లి ఉపసర్పంచి దుంపా అనిల్‌కుమార్‌రెడ్డి, కుంచా బ్రహ్మయ్య, పిన్నిక కోమలేష్ పాల్గొన్నారు. నూతనంగా జరుగుమల్లి వైసిపి అధ్యక్షులుగా భాద్యతలు చేపట్టిన పిన్నిక శ్రీనివాసరావుని జరుగుమల్లి నాయకులు అభినందించారు. భవిష్యత్తులో మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని జరుగుమల్లి నాయకులు ఆకాంక్షించారు.

శింగరాయకొండ: మాజీ మంత్రి కొండేపి వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఇన్చార్జి డాక్టర్ ఆదిమూలపు సురేష్ పుట్టినరోజు వేడుకలు ఆదివారం నాడు శింగరాయకొండలోని ఆయన క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర నాయకులు డాక్టర్ బత్తుల అశోక్‌కుమార్‌రెడ్డి, శింగరాయకొండ అధ్యక్షులు మసనం వెంకట్రావు టంగుటూరు మండల పార్టీ అధ్యక్షులు చింతపల్లి హరిబాబు, పొన్నలూరు మండల అధ్యక్షులు దుడ్డుగుంట మల్లికార్జున్‌రెడ్డి, కొండేపి మండల అధ్యక్షులు బచ్చల కోటేశ్వరరావు, జరుగుమల్లి మండల అధ్యక్షులు పిన్నిక శ్రీనివాసులు, మర్రిపూడి మండల అధ్యక్షులు ఇంకొల్లు సుబ్బారెడ్డి ఆధ్వర్యంలో ఆదిమూలపు సురేష్‌ను గజమాలతో ఘనంగా సత్కరించారు. వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ మైనార్టీ సెల్ రాష్ట్ర నాయకులు పఠాన్ రియాజ్, జిల్లా అధ్యక్షులు ఎస్కే సుల్తాన్, ఎంపీపీ కట్టా శోభారాణి తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



శింగరాయకొండలో సురేష్‌ను సత్కరిస్తున్న నాయకులు



టంగుటూరులో సురేష్‌ను సత్కరిస్తున్న నాయకులు

ఫ్లెక్సీలో కనిపించని ముఖ్యనేతల ఫొటోలు

సురేష్ పుట్టినరోజు సందర్భంగా ఆదివారం నాడు శింగరాయకొండ పట్టణంలో వేసిన ఫ్లెక్సీలో ముఖ్యనేతల ఫొటోలు కనిపించకపోవడంతో పార్టీలో కొందరు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఫ్లెక్సీలో కేవలం కొత్త నాయకుల హంగామానే కనిపిస్తోందన్నారు. శింగరాయకొండ జడ్పిటీసీగా జిల్లా పరిషత్ వైస్ చైర్మన్‌గా ఉన్న యన్నాబత్తిన అరుణ, ఎంపీపీగా ఉన్న కట్టా శోభారాణి ఫొటో లేకపోవటం కూడా చర్చనీయాంశమైంది. సర్పంచ్‌గా ఉన్న తాటిపర్తి వనజ ఫొటోను కూడా వదిలేయటం గమనార్హం.

నేడు పొగాకు రైతుల సదస్సు

ప్రజాశక్తి -యద్దనపూడి

మండలంలోని పూనూరు, పోలూరు, జాగర్లమూడి, గన్నవరం గ్రామాలలో పర్చూరు గ్రామ అద్దంకమ్మ కల్యాణ మండపంలో సోమవారం జరుగు నల్ల బర్లీ రైతు సదస్సు జయప్రదం చేయాలని కోరుతూ రైతు సంఘం నాయకులు ఆదివారం కర పత్రాలు పంపిణీ చేశారు. ఈ సదస్సు ఉదయం 10 గంటలకు జరుగుతుందని తెలిపారు. నల్ల బర్లీ పొగాకుకు మద్దత్తు ధర కల్పించాలని ఆ కర పత్రంలో కోరారు. ఈ సదస్సుకు వి కృష్ణయ్య, మాజీ మంత్రి వడ్డె శోభనాదీశ్వరరావు, డి రమాదేవి, హరిబాబు, కొల్లా రాజమోహన్రావు హాజరు అవుతున్నారని తెలిపారు. కార్యక్రమంలో బత్తుల హనుమంతారావు, వీరవల్లి కృష్ణ మూర్తి పాల్గొన్నారు.

వేసవి విజ్ఞాన శిబిరం

ప్రజాశక్తి - కొల్లూరు

వేసవి విజ్ఞాన శిభిరాన్ని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంధపాలకుడు కోరారు. స్థానిక శాఖా గ్రంథాలయం ఆధ్వర్యంలో విద్యార్థులకు వేసవి విజ్ఞాన శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. ఏప్రిల్ 28 నుంచి జూన్ 6వరకు జరిగే శిబిరంలో కథలు వినుట, పుస్తక పఠనం, ,పుస్తక సమీక్షలు, పెద్దల నుంచి నిన్న ఆముద్రత కథనాలు చెప్పుట, చిత్రలేఖనంలో పేపర్ ఆర్ట్స్, థియేటర్ ఆర్ట్స్ వంటి సృజనాత్మక కార్యక్రమాలు ప్రతిరోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 11 గంటల వరకు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. విద్యార్థులను తల్లిదండ్రులు ప్రోత్సహించాలని కోరారు.

కత్తితో దాడి చేసిన వ్యక్తికి రిమాండ్

ప్రజాశక్తి - రేపల్లె

పట్టణంలోని 7వ వార్డులో శనివారం జరిగిన సంఘటనలో దేవరపల్లి నవీన్ కుమార్ అనే యువకునిపై కత్తితో విచక్షణ రహితంగా నరికి తీవ్రంగా గాయపర్చిన దేవరకొండ కోటేశ్వరరావును పోలీసులు ఆదివారం అరెస్ట్ చేసినట్లు సీఐ మల్లికార్జునరావు తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు రేపల్లి డిఎస్పి ఎ శ్రీనివాసరావు పర్యవేక్షణలో నిందితుడు కోటేశ్వం రావును అరెస్టు చేసి మేజిస్ట్రేట్ ఎదుట కోర్టులో హాజరు పర్చగా 14 రోజులు రిమాండ్ విధించారని తెలిపారు.



కాగడాలతో ర్యాలి నిర్వహిస్తున్న దృశ్యం

ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ శాంతి ర్యాలీ

ప్రజాశక్తి - వేటపాలెం

జమ్ము కాశ్మీర్లో పర్యాటకులపై ఉగ్రవాదులు చేసిన దాడిని ఖండిస్తూ వర్తక సంఘాల అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆదివారం శాంతి యుత నిరసన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఉగ్రవాద సంస్థలను దేశం నుంచి తరమికొట్టాలని అన్నారు. ఉగ్రవాదుల దాడిలో మరణించిన వారికి నివాళి అర్పించారు. కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. స్వచ్ఛందంగా దుకాణాలు మూసి పట్టణంలో ర్యాలి నిర్వహించారు. ఉగ్రవాదులకు వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఉగ్రవాదులను మట్టుబెట్టేందుకు ప్రభుత్వాలు తీసుకునే చర్యలకు ప్రజలందరూ మద్దతుగా నిలవాలని కోరారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఇటువంటి సంఘటనలు మరోసారి జరగకుండా పటిష్ట చర్యలు చేపట్టాలని కోరారు. ఉగ్రవాద చర్యలు దేశానికి నష్టం చేస్తాయని అన్నారు. టూరిస్టులపై ఉగ్రవాదులు దాడి చేయడం హేయమైన చర్యని అన్నారు. పర్యాటక ప్రదేశమైన కాశ్మీర్లో శాంతియుత వాతావరణం నెలకొనేలా చర్యలు చేపట్టాలని కోరారు. కార్యక్రమం జీడిపప్పు అసోసియేషన్ ప్రెసిడెంట్ ఊటుకూరు వెంకట శ్రీనివాసరావు, పద్మనాభుని బద్రీనాథ్, చీమకుర్తి గుప్త, కారంచేటి శివరామకృష్ణ, ఆత్మకూరి సురేష్, గొల్లపూడి సుధాకర్, కోడూరి తరుణ్, గ్రంధి నాగంజనేయులు, కొత్తమాసు ప్రసాదరావు పాల్గొన్నారు.

ఉచిత కంటి వైద్యశిబిరానికి విశేష స్పందన


కంటి పరీక్షలు చేస్తున్న శంకర్ నేత్రాలయ వైద్యులు

ప్రజాశక్తి - మార్టూరు రూరల్

నోవా అగ్రి గ్రూప్, ఏలూరి చారిటబుల్ ట్రస్ట్, గ్రీన్ స్పార్క్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో శంకర్ కంటి ఆసుపత్రి సౌజన్యంతో మండలంలోని ఇసుక దర్శిలో ఉన్న ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నిర్వహించిన ఉచిత మెగా కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. మహిళలు, పురుషులకు వేరువేరుగా ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి తాగునీరు, భోజన సదుపాయం కల్పించారు. ఉదయం 7 నుంచి ప్రజలు పెద్ద ఎత్తున బారులు తీరారు. ఉచిత కంటి వైద్య శిబిరానికి వెయ్యి మంది హాజరు కాగా బీపీ, షుగర్, రక్త పరీక్షలు నిర్వహించారు. వీరిలో 325 మందిని కంటి ఆపరేషన్లకు వైద్యులు రిఫర్ చేశారు. నియోజకవర్గంలో ఏ ఒక్కరు కంటి సమ స్యతో బాధపడ కూడదనే లక్ష్యంతో శాసన సభ్యులు ఏలూరి సాంబ శివరావు ప్రతినెల ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నట్లు కార్యాలయ ప్రతిని ధులు పేర్కొన్నారు. కార్యక్రమంలో తెలుగుదేశం బాపట్ల పార్లమెంట్ ఉపాధ్యక్షులు తొండేపు ఆదినా రాయణ, తాటి నాగేశ్వరరావు, కామేపల్లి హరిబాబు, షేక్ అబ్దుల్ రజాక్, ఫరూక్, శివ నాగేశ్వర రావు, సాదినేని రంగా రావు, కొత్తపల్లి మధు, కోటా కృష్ణ పాల్గొన్నారు.

అద్దంకి : మండలంలోని మణికేశ్వరంలో ఒంగోలు యామిని కంటి హాస్పిటల్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఉచిత కంటి వైద్య శిబిరాన్ని ఐటిడిపి నియోజకవర్గ అధ్యక్షుడు షేక్ కరిముల్లా, స్థానిక టిడిపి నాయకులు రిబ్బన్ కట్ చేసి ఆదివారం ప్రారంభించారు. శిబిరంలో వృద్ధులకు ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. కంటిలో శుక్లాలు, పొరలు ఉన్న వారికీ బయట ఆస్పత్రులు కంటే తక్కువ ధరలో చికిత్స చేయనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఈ సందర్భంగా టిడిపి నాయకులు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లోని ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలనే ఉద్దేశంతో ఉచిత వైద్య శిబిరం ఏర్పాటు చేయటం అభినందనీయమని అన్నారు. కార్యక్రమంలో టిడిపి అధ్యక్షుడు ఈసువలి, మౌలాలి, బడావలి, అశోక్, మాథ్యూస్, నాగయ్య, డి రవీంద్ర, రవి, రూబేను, కాలేషా, అబ్దుల్లా, సర్దార్, ఫకీర్ పాల్గొన్నారు.

పంగులూరు : రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో ఉచిత కంటి వైద్య శిబిరం ఆదివారం నిర్వహించారు. శిభిరంలో 174 మంది హాజరై య్యారని, వీరిలో 117 మందికి కంటి శుక్లంల ఆపరేషన్లు అవసరమని వైద్యులు నిర్ణయించినట్లు క్లబ్ అధ్యక్ష కార్యదర్శులు షేక్ కాలేషావలి, డాక్టర్ బత్తుల వీరనారాయణ, పంగులూరు క్యాంప్ ఇంచార్జి చిలుకూరి వీర రాఘవయ్య తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ శుక్లంల ఆపరేషన్ల కోసం ఎంపిక చేయబడ్డ 117 మందిలో 72 మంది పురుషులు, 42 మంది మహిళలని తెలిపారు. వీరిలో ఈరోజు 45 మందిని బస్సు ద్వారా గుంటూరు జిల్లా కాకానిలోని శంకర్ నేత్రాలయానికి తీసుకెళ్తామని తెలిపారు. మిగిలిన 72 మందిని 29న తీసుకువెళ్లి ఆపరేషన్లు చేయించిన తర్వాత వారిని తిరిగి ఇదే స్థలానికి తీసుకొస్తామని తెలిపారు. రోటరీ క్లబ్ ఏర్పడినప్పటి నుండి ప్రతి ఏటా రెండు, మూడు సందర్భాల్లో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తున్నామని, ఈ ప్రాంతంలో వేలాది మంది పేదలకు శుక్లంల ఆపరేషన్లు ఉచితంగా చేయించామని చెప్పారు. ఇంకా క్లబ్ ఆధ్వర్యంలో అనేక కార్యక్రమాలు నిర్వహించామని అన్నారు. భవిష్యత్తులో ఉచిత కంటి వైద్య శిబిరాలు నిర్వహిస్తామని చెప్పారు. కార్యక్రమంలో డాక్టర్ చిన్మయ, శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల క్యాంప్ ఇంచార్జి గంగాధర్, బాచిన వెంకట రామారావు, పోతిన ప్రసాద్ పాల్గొన్నారు.


అద్దంకిలో వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు



రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కంటి పరీక్షలు నిర్వహిస్తున్న దృశ్యం

ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులకు పురస్కారం

ప్రజాశక్తి - వేటపాలెం

పదోతరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులను దేవాంగ సంక్షేమ సంఘం, దేవల మను బ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఆదివారం ఘనంగా సత్కరించారు. పందిళ్ళపల్లి, వేటపాలెం, దేశాయిపేట, జాండ్రపేట ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి ఫలితాల్లో ఉత్తమ మార్కులు సాధించిన పేద చేనేత విద్యార్థినీ, విద్యార్థులకు మెమొంటో, నగదు పురస్కారం ఇచ్చి, శాలువాతో సత్కరించారు. బిబిహెచ్ డిగ్రీ కాలేజీ విశ్రాంత ప్రిన్సిపాల్ డాక్టర్ సత్రం మల్లేశ్వరరావు మాట్లాడుతూ జిల్లా స్థాయిలో పందిళ్ళపల్లి జెడ్పి ఉన్నత పాఠశాలకు చెందిన సజ్జా దివ్యశ్రీ 596 మార్కులు సాధించడంపట్ల ఆమె తల్లి, దండ్రులను అభినందించారు. ఆమెకు రూ.2116 నగదు పురస్కారం, మెమెంటో అందజేసి, శాలువాతో సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతూ మంచి మార్కులు సాధించిన సజ్జా దివ్యశ్రీ,


విద్యార్థులను సత్కరిస్తున్న దేవాంగ సంఘం ప్రతినిధులు

నిరుపేద చేనేత కుటుంబాలకు చెందిన అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులకు శుభాకాంక్షలు తెలిపారు. రాబోయే రోజుల్లో ఉన్నత చదువుల్లో మంచి ఫలితాలు సాధించి, మంచి పేరు ప్రతిష్టలు తెచ్చుకోవాలని ఆకాంక్షించారు. ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థినీ, విద్యార్థులు కుందుం శ్యామ సాయి శ్రీ (589), పృధివి ధనుష్ (589), గుత్తి మోహిత్ విజయ్ కుమార్ (587), బండ్ల షణ్ముఖ ప్రియ (585), పేరక గీతిక (585), పేరిశెట్ల కనిష్క (578), గుంటూరు యామిని యోజిత (576), పింజల యశ్వంత్ మణికుమార్ (584), బాలం శ్రీనివాసులు (571) బివి అండ్ బిఎన్ ఉన్నత పాఠశాల సంఘ పెద్దలు నగదు పురస్కారం, మెమొంటో, శాలువాతో ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు కుర్మా రాహుల్జీ, దేవల మనుబ్రహ్మ దేవాంగ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షులు ఒలుకుల మోహనరావు, కర్ణ లక్షారావు, యూరాసు అరుణ్ బాబు, చింతా రాము, భూషణ్ శ్రీనివాసరావు, నాసిక జగన్మోహన్రావు, గుత్తి బాలసుబ్రమణ్యం, జాగాబత్తుని పోతురాజు, పిచ్చుక భార్గవ్ రామ్, ధోగుపర్తి రాజేష్, పింజల సుబ్రహ్మణ్యం, గుంటూరు యాజ్ఞేశ్వరరావు, కుందుం నాగరాజు, బైన రాజేష్, సజ్జా పెద్ద కోటేశ్వరరావు పాల్గొన్నారు.

సిపిఎస్ నుండి వికలాంగులను మినహాయించాలి

ప్రజాశక్తి - బాపట్ల

అమల్లో ఉన్న సిపిఎస్ విధానాన్ని దివ్యాంగ ఉద్యోగులకు మినహాయించాలని శారీరక దివ్యంగ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షులు డి ఎల్లయ్య కోరారు. పట్టణంలోని ఎన్జిఒ హోంలో ఆదివారం జరిగిన ఆత్మీయ సమావేశంలో ఆయన మాట్లాడారు. సమావేశానికి జిల్లా అధ్యక్షులు ఎ శివాజీ గణేషన్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శారీరిక దివ్యాంగ ఉద్యోగులకు ఏ విధమైన నిబంధనలు లేకుండా ఏడు సాధారణ సెలవులు వర్తింప చేయాలని అన్నారు. ఫేషియల్ అటెండెన్స్ నుంచి మినహాయింపు ఇచ్చే విధంగా ప్రభుత్వంతో సంప్రదిస్తానని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర ఉపాధ్యక్షులు వెంకటేశ్వరరావు, ప్రకాశం జిల్లా అధ్యక్షుడు కె కోటేశ్వరరావు, రాష్ట్ర కోశాధికారి శివ, జిల్లా కమిటీ సభ్యులు శ్రీనివాసరావు, సిహెచ్ శ్రీనివాసరావు, మురళి, కృష్ణమోహన్, జిలాని పాల్గొన్నారు.


శారీరక దివ్యాంగ ఉద్యోగుల ఆత్మీయ సమావేశం

రైలు ఎక్కబోయి జారిపడ్డ ప్రయాణికుడు

ప్రజాశక్తి - బాపట్ల

కదులుతున్న రైలు ఎక్కబోయే క్రమంలో రైల్వే ప్లాట్ ఫారం సందు జారి పడిన ప్రయాణికుడి కాలికి తీవ్ర గాయమైన సంఘటన స్థానిక రైల్వే స్టేషన్లో ఆదివారం చోటుచేసుకుంది. రైల్వే పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం గూడూరు నుండి సికింద్రాబాద్ వెళ్ళే సింహపురి ఎక్స్ ప్రెస్ లో షార్వాన్ అనే వ్యక్తి ఖమ్మం వెళ్లేందుకు చీరాలలో రైలు ఎక్కాడని, రైలు బాపట్ల రైల్వే స్టేషన్కు చేరుకున్నాక మంచినీళ్ల కోసం రైలు దిగి నీళ్ళు పట్టుకుంటుండగా రైలు కదలడంతో షార్వాన్ పరిగెత్తుకుంటూ వెళ్లి వేగం పుంజుకున్న రైలు ఎక్కుతున్న క్రమంలో ఫ్లాట్ ఫాంకు రైలుకు మధ్యలో పడి కాలుకు తీవ్ర గాయాలైనట్లు తెలిపారు. జిఆర్పి కానిస్టేబుల్ పావని, ఆర్పిఎఫ్ పోలీసులు స్పందించి గాయాల పాలైన ప్రయాణికుడిని గుంటూరు ఆసుపత్రికి తరలించారు.


ప్రయాణికుణ్ణి వైద్యశాలకు తరలిస్తున్న దృశ్యం

ప్రజాశక్తి
సోమవారం 28 ఏప్రిల్ 2025

వడదెబ్బకు గురికాకుండా జాగ్రత్తలు పాటించాలి

• ఉదయం 10 దాటితే బయటకు రాని జనం • మధ్యాహ్నానికి రోడ్లన్నీ నిర్మానుష్యం



ప్రజాశక్తి - అద్దంకి

ఎప్పుడూ లేనంతగా ఎండలు మండుతున్నాయి. మే నెల రాకుండానే ఉష్ణోగ్రతలు 45 డిగ్రీలు దాటేస్తున్నాయి. భానుడి భగ, భగలు ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నాయి. ఎండలో కాలు బయటపెట్టాలంటే జంకే పరిస్థితి ఏర్పడింది. వేడిగాలుల తీవ్రత పెరిగింది. ప్రస్తుత తరుణంలో వడదెబ్బ తగిలే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. వడదెబ్బ అంటే ఏమిటి? దీని బారిన పడకుండా ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలో వైద్యులు సూచిస్తున్నారు.

వడదెబ్బ అంటే ఏమిటి

శరీరం అధిక ఉష్ణోగ్రతకు గురైనప్పుడు నాడీ సమస్యలు తలెత్తుతాయి. అధిక ఉష్ణోగ్రత, డీ హైడ్రేషన్‌కు గురైనప్పుడు చర్మం, ఊపిరితిత్తులు సరిగా పనిచేయవు. దీంతో శరీర ఉష్ణోగ్రత ఒక్కసారిగా అధిక స్థాయికి చేరుతుంది. దీనినే వడదెబ్బ, హీట్ స్ట్రోక్, సన్ స్ట్రోక్ అంటారు. వేసవిలో చిన్న పిల్లలు, వృద్ధులు, క్రీడాకారులు, రోజువారీ కూలీలు, శ్రమజీవులు, ఎక్కువగా ఆరుబయట పనిచేసేవారికి వడదెబ్బ తగిలే ప్రమాదం ఉంది.

సమస్యలున్న పిల్లలతో జాగ్రత్త

పెరిగిన ఎండ వేడిని తట్టుకోవడం పెద్దలతో పాటు చిన్నారులకు కూడా చాలా కష్టం. అయితే వేసవిలో గుండె జబ్బులతో బాధపడే చిన్నారుల విషయంలో మరింత జాగ్రత్తగా ఉండాలని వైద్యులు సూచిస్తున్నారు. వేసవిలో వాతావరణ ఉష్ణోగ్రత పెరగడం వల్ల ఒంట్లో నీరు చెమట రూపంలో ఎక్కువగా బైటకుపోతుంది. దీంతో గుండె సమస్యలున్న చిన్నారుల ఒంట్లో నీటిశాతం తగ్గి, రక్తం చిక్కబడే ముప్పు పెరుగుతుంది. రక్తం చిక్కబడినప్పుడు తలనొప్పి, తీవ్రమైన అలసట, మగత వంటి లక్షణాలు తలెత్తుతాయి. రక్తం సిరల్లో గడ్డకట్టే ప్రమాదం ఉంది. గుండెలో సమస్యలున్న పిల్లలను ఎండలో ఎక్కువగా తిరగనీయకూడదు. వీరిని వేసవిలో బీచ్‌లకు తీసుకెళ్లటం మంచిది కాదు. నీరు, ఆరోగ్యానికి మేలు చేసే ఇతర ద్రవ పదార్థాలు ఎక్కువగా ఇవ్వాలి. వాంతులు, విరేచనాలు అవుతుంటే నిర్లక్ష్యం చేయకుండా వెంటనే ఆసుపత్రికి తీసుకెళ్లాలి. గుండెలో రంధ్రంతో బాధపడే చిన్నారులకు తలనొప్పి, జ్వరం, కళ్లు సరిగా కనిపించకపోవడం వంటి లక్షణాలు కనిపిస్తే డాక్టరుకు చూపించాలి. రక్తంలో ఆక్సిజన్ శాతం తగ్గటం వల్ల కొందరు పిల్లలు ఎక్కువగా ఏడిస్తే పెదవులు, గోళ్లు, ముఖం నీలంగా మారతాయి. వీరికి చిన్నప్పుడు స్టంట్ వేసి, కొన్నేళ్ల తర్వాత పెద్ద ఆపరేషన్ చేస్తుంటారు. వీరి విషయంలో వేసవిలో ఇంకాస్త ఎక్కువ జాగ్రత్తగా ఉండాలి.

నీరు తాగడంలో నిర్లక్ష్యం వద్దు

చాలా మంది దాహం ఎక్కువగా ఉంటే తప్ప నీటిని తాగడానికి అంత ఆసక్తి చూపరు. అయితే శరీరంలో జీవ ప్రక్రియ సక్రమంగా జరగడానికి తగినంత నీరు తాగుతుండాలి. తగిన పరిమాణంలో నీరు తాగకపోతే ఇలాంటి సమస్యలు తలెత్తుతాయని వైద్యులు సూచనలు చేస్తున్నారు. నీరు తగినంత తాగకపోతే శరీరం డీహైడ్రేట్ అవుతుంది. దీని వల్ల చర్మం తేమను కోల్పోయి పొడి బారుతుంది. ఇదే సమస్య ఎక్కువ కాలం ఉంటే తామర, మొటిమలు, ఇతర చర్మ సమస్యలు తలెత్తుతాయి. నీరు తక్కువగా తాగితే చిన్నతనంలోనే వృద్ధాప్య ఛాయలు కనిపిస్తాయి. నీరు తక్కువగా తాగితే రోగనిరోధక శక్తి తగ్గి ఇన్ఫెక్షన్ల ముప్పు పెరిగే అవకాశం ఉంటుంది. మూత్రపిండాలు సరైన రీతిలో పనిచేయవు. దీర్ఘకాలంలో మూత్రపిండాల్లో రాళ్లు, మూత్ర నాళాల ఇన్ఫెక్షన్లతో పాటు కిడ్నీలు దెబ్బతినే ప్రమాదం ఉంది. జీర్ణక్రియ సక్రమంగా జరగడంలో నీరు కీలక పాత్ర పోషిస్తుంది. డీహైడ్రేషన్ వల్ల మలబద్ధక సమస్య పెరుగుతుంది. సరిపడా నీళ్లు తాగకపోతే భవిష్యత్తులో తీవ్రమైన జీర్ణ సమస్యలు ఎదురవుతాయి. డీహైడ్రేషన్ మెదడు పనితీరుపై ప్రభావం చూపుతుంది. ఆందోళన, అలసట, ఏకాగ్రత తగ్గడం, జ్ఞాపకశక్తి సమస్యలు వస్తాయని వైద్యులు తెలిపారు.



సీఎం సహాయ నిధి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆనందబాబు

పేదలకు వరం సీఎం సహాయనిధి

ప్రజాశక్తి - అమృతలూరు

ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న పేదలకు వరమని శాసన సభ్యులు నక్క ఆనందబాబు అన్నారు. మండలంలోని యాడవూరు గ్రామానికి చెందిన బొంత నాగరాజు, మూల్పూరు గ్రామానికి చెందిన రెడ్డి యానదమ్మ అనారోగ్యంతో ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స చేయించుకున్నారు. చికిత్స కోసమైన బిల్‌ను శాసన సభ్యులు నక్కా ఆనంద బాబు సిఫార్సు ద్వారా ముఖ్యమంత్రి సహాయ నిధి కార్యాలయానికి పంపించారు. అనంతరం సిఎం సహాయ నిధి నుంచి మంజూరైన నగదును చెక్కు రూపంలో బొంత నాగరాజుకు రూ.1,53,452, రెడ్డి యానదమ్మకు రూ.24వేల చొప్పున ఎంఎల్ఎ తన క్యాంపు కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు ఆదివారం అందజేశారు. కార్యక్రమంలో టిడిపి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



సిఎం, ఎమ్మెల్యే ఫ్లెక్సీకి పాలాభిషేకం చేస్తున్న మత్స్యకారులు

సిఎం, ఎమ్మెల్యే చిత్రపటాలకు పాలాభిషేకం

ప్రజాశక్తి - చీరాల

మత్స్యకారులకు టిడిపి కూటమి ప్రభుత్వం అండగా ఉంటుందని, ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు రూ.20వేల భృతిని అమలు చేసి మత్స్యకారుల అభివృద్ధికి బాటలు వేసిందని మత్స్యకారులకు తమ ఆనందాన్ని వ్యక్తం చేశారు. మత్స్యకారులకు భృతి విడుదల చేయడంతో సిఎం చంద్రబాబు, శాసన సభ్యులు మద్దలూరి మాల కొండయ్య చిత్రపటాలకు మండలంలోని వాడరేవులో మత్స్యకారులు ఆదివారం పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా పలువురు మత్స్యకారులు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం తమకు అండగా నిలిచిందని అన్నారు. ఎన్నికల్లో ఇచ్చిన హామీని అమలు చేసి మత్స్యకారులకు చేయూత అందించిదని అన్నారు. వేట నిషేధ సమయంలో ఈ భృతి కుటుంబ పోషణకు ఎంతగానో దోహదపడుతుందని అన్నారు. ఎఎంసి చైర్మన్ కౌతరపు జనార్ధనరావు మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలు అన్నీ అమలు చేస్తున్న ఘనత చంద్రబాబుదేనని అన్నారు. గత వైసిపి ప్రభుత్వంలో అరకొరగా హామీలు అమలు చేసి ప్రజలకు అబద్దాలు ప్రచారం చేశారని అన్నారు. గెలిచిన వెంటనే పెన్షన్ పెంచుతామన్న జగన్‌రెడ్డికి వెయ్యి పెంచడానికి ఐదేళ్లు పట్టిందని గుర్తు చేశారు. చంద్రబాబు ఇచ్చిన మాట ప్రకారం మత్స్యకార భృతి రూ.10వేల నుండి ఒకేసారి రూ.20వేలకు పెంచి ఇచ్చారని చెప్పారు. వీటితోపాటు సబ్సిడీపై మత్స్యకారులకు వలలు, ఇతర పరికరాలు కొనుగోలు చేసుకునేందుకు రుణాలు ఇస్తున్నట్లు తెలిపారు. పనిచేసే ప్రభుత్వానికి ప్రచారం చేసుకునే ప్రభుత్వానికి తేడా గుర్తించాలని కోరారు. వైసిపి నేతల అబద్దాలు నమ్మొదని అన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ ఎరిపిల్లి రమణ, పిక్కి కోదండం, రామకృష్ణ, జనసేన నాయకులు విజయ్, చిన్నారావు, గురన్న, అప్పారావు, గోసాల శీను, ఏసోబు, మహేష్ బాబు, బుల్లియ పాల్గొన్నారు.

ఉచిత వైద్యశిబిరానికి విశేష స్పందన



వైద్య శిభిరం వద్ద బారులు తీరిన ప్రజలు

ప్రజాశక్తి- చీరాల

మండలంలోని వాడరేవు రామానంద ట్రస్ట్ ఆధ్వర్యంలో ఆశ్రమం ఆవరణలో షుగరు వ్యాధికి ఉచిత వైద్య శిభిరం ఆదివారం నిర్వహించారు. వివిధ ప్రాంతాల నుండి వేకువ జాము నుండే వచ్చిన 1276 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు చేశారు. రెండు నెలలకు సరిపడు మందులు ఉచితంగా అందజేసినట్లు ఆశ్రమ మేనేజర్ నారాయణం సురేష్ తెలిపారు. శిభిరానికి హాజరైన వారందరికి అల్పాహారం, తాగునీరు, ఇతర సహాయక ఏర్పాట్లు చేశారు. షుగర్ వ్యాధి బాధితులు ఎక్కువ సమయం వేచి ఉండ కుండా వేసవి ఎండ తీవ్రతను దృష్టిలో ఉంచుకుని శిభిరానికి వచ్చిన వారందరికి వేగంగా వైద్య పరీక్షలు చేసేందుకు అవసరమైన ఏర్పాట్లు చేసి త్వరగా పరీక్షలు చేసినట్లు తెలిపారు. త్వరగా సేవలు అందే విధంగా విస్తృత ఏర్పాట్లతో మధ్యాహ్నానికే పరీక్షలు చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా వైద్యులు రోగులకు షుగరు వ్యాధిపై అవగాహన కల్పించారు. వేసవిలో తీసుకోవాలసిన జాగ్రత్తలు వివరించారు. రోజువారీ జీవన విధానం మార్చుకోవాలని సూచించారు. ఆహారపు అలవాట్లు మార్చుకుంటే షుగర్ నియంత్రణలో ఉంటుందని చెప్పారు. మానసిక ఆందోళన తగ్గించుకోవాలని చెప్పారు. ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వ్యాయామం, నడక అలవాటు చేసుకోవాలని చెప్పారు.వైద్య శిభిరంలో డాక్టర్ ఎం రాజరాజేశ్వరి, డాక్టర్ కమలా రాజేశ్వరి, డాక్టర్ లలిత్ ప్రకాష్, డాక్టర్ పేట శ్రీకాంత్, డాక్టర్ ప్రకాష్ వైద్య పరీక్షలు చేశారు. ట్రస్ట్ ఉపాధ్యక్షులు కె కృష్ణారావు, సాయి ఫణికిషోర్, చందన, కామేశ్వరరావు, ఎంజి శంకరరావు, బసవరావు, కుమార్, ఎ సురేష్, మిత్ర ల్యాబ్ వలి, గోపాల్, వాడరేవు స్కూల్ విద్యార్థులు, ఉపాధ్యాయులు, చీరాల మహిళా కళాశాల విద్యార్థులు రోగులకు ఆహారం, తాగునీటి వసతులు, సహాయక ఏర్పాట్లు చేశారు.

గ్రంథాలయాలను సద్వినియోగం చేసుకోవాలి



విద్యార్థులకు శిక్షణ ఇస్తున్న గ్రంధపాలకురాలు ధనమ్మ

ప్రజాశక్తి - చీరాల

పాఠశాలలు ముగిసిన నేపథ్యంలో వేసవిలో సమయాన్ని వృధా చేసుకోకుండా గ్రంథాలయాల్లో నిర్వహించే వేసవి విజ్ఞాన శిబిరాలు విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని గ్రంథ పాలకురాలు డి ధనమ్మ అన్నారు. ఈ నెల 28 నుండి జూన్ 6 వరకు ఉచిత వేసవి శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు ఆదివారం తెలిపారు. 6వ తరగతి నుండి 10వ తరగతి వరకు 15ఏళ్ల లోపు విద్యార్థులకు శిక్షణా తరగతులు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. స్పోకెన్ ఇంగ్లీష్, డ్రాయింగ్, పెయింటింగ్, పేపర్ క్రాఫ్ట్, మ్యూజిక్, డ్యాన్స్ క్యారమ్స్, ఇతర అంశాలు నేర్పిస్తున్నట్లు తెలిపారు. దాతల సహకారంతో మజ్జిగ, స్నాక్స్, శీతల పానియాలు అందించనున్నట్లు తెలిపారు. ఈ అవకాశం సద్వినియోగం చేసుకునే విధంగా విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు విద్యార్థులను ప్రోత్సాహించాలని అన్నారు.



వాహనాలు తనిఖీ చేస్తున్న పోలీసు అధికారులు

ఆకస్మికంగా వాహనాల తనిఖీ

ప్రజాశక్తి - సంతమాగులూరు

భారత్, పాకిస్తాన్ సరిహద్దుల ఉద్రిక్తల నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు రెండు తెలుగు రాష్ట్ర ప్రభుత్వాలు అప్రమత్తం అయ్యాయి. పాకిస్తానీయులను దేశం వదిలి వెళ్లిపోవాలని ఆదేశాలు జారీ చేసి యుండగా, మరోవైపు అరాచక శక్తులు తప్పించుకుని భారత్‌లో ఏ మూలన తల దాచుకోకుండా కఠినమైన చర్యలు చేపట్టారు. అందులో భాగంగానే రాష్ట్ర, జాతీయ రహదారులపై ప్రయాణించే వాహనాలను పోలీసు బలగాలు ఆకస్మిక తనిఖీలు చేపడుతున్నారు. అద్దంకి, నార్కెట్ పల్లి, గుంటూరు, కర్నూలు రహదారులపై సంతమాగులూరు సిఐ కె వెంకటరావు, ఎస్ఐ పట్టాభిరామయ్య తమ సిబ్బందితో ఆదివారం ఆకస్మిక తనిఖీలు చేపట్టారు. ప్రతి వాహనాన్ని నిశితంగా తనిఖీలు చేస్తూ వాహనాల్లో ప్రయాణించే వారు ఎవరు ఎక్కడ నుండి ఎక్కడకు ప్రయాణిస్తున్నారనే వివరాలు నమోదు చేస్తున్నారు.



విద్యుత్ స్తంభాన్ని ఢీకొన్న కారు

స్తంభాన్ని ఢీకొన్న కారు

ప్రజాశక్తి - బాపట్ల

బాపట్ల, సూర్యలంక మార్గంలో కోమలి రెస్టారెంట్ సమీపంలో వేగంగా ప్రయాణిస్తున్న కారు విద్యుత్ స్థంభాన్ని ఢీ కొని బోల్తా కొట్టిన ప్రమాదంలో ఒకరు మృతి చెందారు. ఈ సంఘటనలో మరొకరికి తీవ్ర గాయాలు అయ్యాయి. క్షతగాత్రుడిని వైద్యం కోసం చీరాల ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా ఉన్నట్లు తెలిసింది. మృతి చెందిన వ్యక్తి బాపట్ల మండలం అడవి పంచాయతీ రామనగర్ గ్రామానికి చెందిన దండుప్రోలు కృపాకర్ అని తెలిసింది. మరింత సమాచారం తెలియాల్సి ఉంది. పోలీసులు కేసు నమోదు చేసిన దర్యాప్తు చేస్తున్నారు.

మహిళలకు ఇచ్చిన

వాగ్దానాలు అమలు చేయాలి..

ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్



మాట్లాడుతున్న ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి

ప్రజాశక్తి-బాపట్ల

ఎన్నికలకు ముందు కూటమి పార్టీలు మహిళలకు ఇచ్చిన వాగ్దానాలను తక్షణమే అమలు చేయాలని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి డిమాండ్ చేశారు. ఆదివారం పట్టణంలో పుచ్చలపల్లి సుందరయ్య ప్రజాసంఘాల జిల్లా కార్యాలయంలో అఖిలభారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) జిల్లాస్థాయి ముఖ్య కార్యకర్తల సమావేశంలో ఆమె ముఖ్య అతిథిగా మాట్లాడారు. ఎన్నికలకు ముందుగా కూటమి పార్టీలు తల్లికి వందనం పేరుతో ప్రకటించిన పథకాన్ని అమలులోకి తేవాలన్నారు. మహిళలకు ఆర్టీసీ బస్సులలో ఉచిత ప్రయాణం, అలాగే డ్వాక్రా మహిళలకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. రాష్ట్రంలో అనేక ప్రాంతాల్లో మహిళలు చిన్నారులపై అత్యాచారాలు జరుగుతున్నాయని, వాటిని అరికట్టడం కోసం రాష్ట్ర ప్రభుత్వం పకడ్బందీగా కఠిన చర్యలు అమలు చేయాలని కోరారు. జిల్లా, రాష్ట్ర స్థాయిలో మైక్రో ఫైనాన్స్ సంస్థలు, పేద ప్రజలు వారి అవసరాలను ఆసరాగా తీసుకుని రుణాలు ఇచ్చి వేల రూపాయలు దోచుకుంటున్నాయన్నారు. డబ్బులు చెల్లించని పక్షంలో దాడులు చేస్తున్నారన్నారు. మైక్రో ఫైనాన్స్ సంస్థలు చేస్తున్న ఆగడాలను అరికట్టడానికి జిల్లా కలెక్టర్, ఎస్పీ ఆధ్వర్యంలో మండల స్థాయి వరకు సమీక్ష జరపాలని కోరారు.

పట్టణాల్లోనూ గ్రామాల్లోనూ మద్యం ఏరులై పారుతోంది. దీంతో అనేక కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నా.. ప్రభుత్వం చోద్యం చూస్తోందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో తెలుగు దేశం పార్టీ నాయకులు బెల్ట్ షాపులను ప్రభుత్వ షాపుల్లాగా నిర్వహిస్తున్నారని, అయితే అధికారులు పట్టించుకోవటం లేదన్నారు. మద్యానికి అనేకమంది బానిసలు కావడంతో అనేక కుటుంబాల్లో భార్యాభర్తల మధ్య కలహాలు ఈ మధ్యకాలంలో పెరిగాయన్నారు. రాష్ట్ర ప్రభుత్వం మద్యాన్ని నియంత్రణ చేసి ప్రజల ఆరోగ్యాన్ని కాపాడాలని కోరారు. డ్వాక్రా మహిళలందరికీ రుణాలు సక్రమంగా సకాలంలో అందించే విధంగా ఉన్నతాధికారులు కృషి చేయాలన్నారు. ఐద్వా జిల్లా నాయకురాలు టి.సుభాషిణి అధ్యక్షతన జరిగిన సమావేశంలో యుటిఎఫ్ జిల్లా నాయకురాలు సుధావాణి, ఎన్ లక్ష్మి, సిహెచ్ సుదీప్తి, వెంకటేశ్వరమ్మ, దానమ్మ, స్పందన, సిహెచ్.చిరంజీవి, నాంచారమ్మ, శారద, వైకుంఠం, వి.చాందిని, ఎన్.పార్వతి, ధనకుమారి, ఎస్తేరు రాణి పాల్గొన్నారు.


సామాన్లతో పాటు రోడ్డుపై ఉన్న బాధితులు శ్రీలక్ష్మి, ఇద్దరు కుమార్తెలు

భార్యాబిడ్డలు వద్దు..ప్రియురాలే ముద్దు.!

- ఇంటికి తాళాలు వేసి.. భార్య, ఇద్దరు ఆడపిల్లల్ని రోడ్డున పడేసిన ప్రబుద్ధుడు
- పోలీసులకు చెప్పినా.. బాధితులకు జరగని న్యాయం

ప్రజాశక్తి-శింగరాయకొండ

ప్రియురాలే ముఖ్యమంటూ.. ఓ ప్రబుద్ధుడు ఇంటికి తాళం వేసి.. భార్య, ఇద్దరు కూతుళ్లను రోడ్డున పడేసిన ఘటన శింగరాయకొండలో ఆదివారం జరిగింది. తన బాధ ఎవరికి చెప్పుకోవాలో అర్థంకాక ఆ ఇల్లాలు రోడ్డుపైనే మండుటెండలో ఇద్దరు కుమార్తెలతో కలిసి రోదిస్తున్న తీరు చూపరులనూ కంటతడి పెట్టించింది.

శింగరాయకొండ గ్రామ పంచాయతీలోని బాలాజీనగర్‌లో నివాసం ఉంటున్న జగన్నాథం శ్రీలక్ష్మి, వంశీకృష్ణ దంపతులకు ఇద్దరు కుమార్తెలు. ఒకమ్మాయి ఇంటర్మీడియట్ చదువుతుండగా మరో అమ్మాయి ఎనిమిదో తరగతి చదువుతోంది. కొన్ని రోజులు కాపురం అలా సాగిపోతున్న వేళ శ్రీలక్ష్మి భర్త వంశీకృష్ణ మరో వివాహం చేసుకున్నాడు. భర్త వివాహం చేసుకున్న తర్వాత తమ ఇద్దరు ఆడపిల్లలతో తనకు న్యాయం చేయాలని శ్రీలక్ష్మి వేడుకుంది. అయితే భర్త ససేమిరా అనటంతో అదే ఇంట్లోనే ఉంటూ కాలం గడిపింది. శ్రీలక్ష్మి అత్త ఉన్నన్ని రోజులు కోడలికి ఎలాంటి ఇబ్బందులు లేకుండా కాపురాన్ని ముందుకు తీసుకువెళ్లింది. ఇటీవల కాలంలోనే అత్త చనిపోవడంతో వంశీకృష్ణ తనకు భార్యాబిడ్డలు వద్దని, ఇంట్లో నుంచి వెళ్లిపోవాలని ఒత్తిడి తెచ్చారు. దీంతో బాధితురాలు పోలీస్ స్టేషన్‌కు వెళ్లి ఫిర్యాదు చేయగా పోలీసులు పట్టించుకోలేదు. ఆదివారం నాడు వంశీకృష్ణ ఇంట్లో నీళ్లు రాకుండా ఆపివేశారు. బాత్రూంకి తాళాలు వేశారు. ఆ తరువాత ఇంట్లో ఉన్న సామాన్లు మొత్తం రోడ్డుపైన విసిరేశాడు. ఇంటికి తాళం వేసి.. భార్య శ్రీలక్ష్మి, ఇద్దరు ఆడపిల్లల్ని గెంటేశాడు. ఏం చేయాలో అర్థం కాక శ్రీలక్ష్మి పోలీసులకి ఫోన్ చేసినా వాళ్లు కూడా స్పందించలేదు. తమకు న్యాయం చేయాలని శ్రీలక్ష్మి వేడుకుంటోంది.

ఉగ్రవాదుల దమనకాండను ఖండించాలి

కొవ్వొత్తులతో నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు సిటీ

కాశ్మీర్‌లో పర్యాటకులకుపై ఉగ్రవాదుల దుశ్చర్యను ప్రతి ఒక్క పౌరుడూ ఖండించాలని సిపిఎం పిలుపునిచ్చింది. ఈ దాడిని ఖండిస్తూ.. మృతులకు సంతాపం తెలియజేస్తూ.. ఆదివారం రాత్రి సిపిఎం భగత్‌సింగ్ విజ్ఞాన కేంద్రం ఆధ్వర్యంలో ఒంగోలులోని గాంధీనగర్ సెంటర్ వద్ద కొవ్వొత్తులతో నిరసన కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా నగర కార్యదర్శి చీకటి శ్రీనివాసరావు మాట్లాడుతూ పర్యాటకులకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని విమర్శించారు. నిఘా సంస్థల హెచ్చరించినప్పటికీ పౌరులకు భద్రత కల్పించడంలో కేంద్ర ప్రభుత్వ నిర్లక్ష్యం ఉందన్నారు. దాడుల్లో 28 మంది ప్రాణాలు కోల్పోతే ప్రధాని నరేంద్ర మోడీ బీహార్ ఎన్నికల సన్నాహ కార్యక్రమాల్లో పాల్గొనడం సిగ్గుచేటన్నారు. ఈ దుర్ఘటనపై కేంద్రం స్పందించి ఉగ్రవాదులను గుర్తించి కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. మతాల మధ్య, ప్రాంతాల మధ్య వైరుధ్యాలు సష్టించి లబ్ధి పొందే బిజెపి కుతంత్రాలను ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. షేక్ పీర్ అధ్యక్షతన జరిగిన ఈ



ఒంగోలులో కొవ్వొత్తులతో సిపిఎం నేతల ర్యాలీ

కార్యక్రమంలో పార్టీ నగర నాయకులు టి.మహేష్, రావూరి శ్రీనివాసరావు, టి.సురేష్, గురవయ్య, దాసు, రామయ్య పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో..

సిఎస్‌పురం రూరల్: ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ జనసేన ఆధ్వర్యంలో శనివారం రాత్రి సీఎస్‌పురంలో కొవ్వొత్తులతో నిరసన ర్యాలీ చేపట్టారు. ఈ సందర్భంగా జనసేన నాయకులు ఉల్లిపాయల సుబ్బ రాయుడు మాట్లాడుతూ పర్యాటకులపై కాల్పులకు తెగబడిన దుండగులను కఠినంగా శిక్షించాలని కోరారు. కార్యక్రమంలో పోర్లా రాంబాబు, బలబద్ర రాంబాబు, బలబద్ర రమేష్, ఊసా మౌలయ్య, ఊసా అల్లూరయ్య, సంగిశెట్టి సాయి, జిలకర నారాయణ, బత్తుల మల్లికార్జున, సంగిశెట్టి మహేష్, సంగిశెట్టి శివమణి తదితరులు పాల్గొన్నారు.

టంగుటూరులో శాంతి ర్యాలీ..

టంగుటూరు: ఉగ్రవాదుల దాడిని ఖండిస్తూ, టంగుటూరు పట్టణ క్రైస్తవులు ఆదివారం శాంతియాత్ర నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టంగుటూరు పట్టణంలోని దేవుని సేవకులు, సువార్తికులు, విశ్వాసులుపురం సెంటర్ నుంచి యాత్రగా బయలుదేరి బస్టాండ్‌లోని బొమ్మల సెంటర్ వరకు శాంతి యాత్ర నిర్వహించారు. కార్యక్రమంలో టంగుటూరు యుపిఎఫ్ అధ్యక్షులు డి.సుకుమార్, హెూలీ క్రాస్ చర్చి సేవకులు హరి ప్రసాద్, షకీనా మహిమ మందిరం సేవకులు వై నిరంజన్, దైవారాధన కేంద్రం సేవకులు సుధీర్, బెరాక మందిరం నుంచి సేవకులు కేసి కోటేశ్వరరావు నూతనరుషలేము సేవకులు సాంబయ్య, స్థానిక సేవకులు పాల్గొన్నారు.

కొవ్వొత్తులతో ర్యాలీ

శింగరాయకొండ: జమ్మూ కాశ్మీర్లో ఉగ్రవాదులు జరిపిన దాడుల్లో మరణించిన వారికి సంఘీభావంగా ఆదివారం రాత్రి శింగరాయకొండలో హిందూ ముస్లిం క్రిస్టియన్ ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. పాకల రోడ్డు నుంచి ఈ ర్యాలీ కందుకూరు రోడ్డు వరకు సాగింది.



సిఎస్‌పురంలో..



శింగరాయకొండలో..


టంగుటూరులో..

ఇండస్ట్రియల్ పార్కుల్లో

358 ప్లాట్లు ఖాళీ..

- 28 ప్లాట్లు కొత్తవారికి కేటాయింపు
- ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలకు పరిశ్రమల స్థాపనకు ఆహ్వానం
- ఎపిఐఐసి జోనల్ మేనేజర్ పి.మదన్‌మోహన్

ప్రజాశక్తి -ఒంగోలు సిటీ

ప్రకాశం జిల్లా ఎపిఐఐసి పరిధిలోని ' ఇండస్ట్రియల్ పార్కుల్లో ' 358 ఖాళీ ప్లాట్లను పరిశ్రమలకు కేటాయించేందుకు ఆ సంస్థ యాజమాన్యం కసరత్తు చేస్తుంది. వివిధ కారణాలవల్ల గత కొంత కాలంగా మూతపడి, వినియోగంలో లేని పరిశ్రమల స్థానంలో కొత్త పరిశ్రమల ఏర్పాటుకు 'ఎపిఐఐసి' 6, 7 నెలలుగా అధికారులు దృష్టి సారించారు. గతంలో ప్లాట్లు పొంది, పరిశ్రమలు స్థాపించని, మూతవేసిన వారికి నోటీసులు ఇచ్చి ఖాళీ చేయించి కొత్త వారికి కేటాయించే ప్రక్రియ మొదలెట్టారు. మూతపడిన పరిశ్రమలను, ఖాళీ ప్లాట్లను గుర్తించడం, తిరిగి వాటిని స్వాధీనం చేసుకోవడం ఇతరులకు కేటాయించడం వంటి వివరాలు 'ఎపిఐఐసి' జోనల్ మేనేజర్ పి.మదన్‌మోహన్ వివరించారు.

జిల్లాలోని 11 ఇండస్ట్రియల్ పార్కుల్లోని 7 పార్కుల్లో 358 (111.53ఎకరాలు) ప్లాట్లు ఖాళీగా ఉన్నాయి. గత 7, 8 నెలల్లో గిద్దలూరు, గుళ్ళిపల్లి గ్రౌత్ సెంటర్, రాగమక్కపల్లి (దొనకొండ)లో కొత్త గా 28 యూనిట్లకు ప్లాట్లు కేటాయించాం. గుర్తించిన వాటిలో రాగమక్కపల్లిలో చిన్న, మధ్య తరగతి పరిశ్రమల స్థాపనకు 232 ప్లాట్లు (22.18 ఎకరాలు), భారీ పరిశ్రమకు 1 (24.13ఎకరాలు), పామూరు మండలం మార్కొండాపురం పార్క్‌లో ఎంఎస్ఎంఇల ఏర్పాటుకు 71 ప్లాట్లు (5.48 ఎకరాలు), గిద్దలూరు ఇండస్ట్రియల్ పార్క్‌లో 7 (5.26 ఎకరాలు), గ్రోత్ సెంటర్ సెజ్‌లో 13 ప్లాట్లు (43.37 ఎకరాలు), గ్రోత్ సెంటర్‌లో మరో 13 ప్లాట్లు (11.07 ఎకరాలు) త్రోవగుంట ఆటోనగర్‌లో 1 ప్లాటు (0.04 ఎకరాలు) ఖాళీగా ఉన్నాయి. వీటిని అర్హులైన వారు దరఖాస్తు చేసుకుంటే ప్రాధాన్యత క్రమంలో కేటాయిస్తాము.

2025- 2026 కొత్త రేట్లు అమలు..

ఈ ఆర్థిక సంవత్సరం ఇండస్ట్రియల్ పార్కుల్లో ఏప్రిల్ 1 నుంచి కొత్త రేట్లు అమలవుతాయి. ప్రాంతాలను అనుసరించి ప్రభుత్వం నిర్ణయించిన ఈ రేట్లు 2026 మార్చి 31 వరకు అమలులో ఉంటాయి. ఒంగోలు ఉడ్ కాంప్లెక్స్ లో చదరపు మీటర్‌కు రూ.17,878, ఇండస్ట్రియల్ పార్క్ లో రూ.11,570 ఆటోనగర్‌లో రూ.5486, మార్కాపురంలో రూ.4404, గ్రోత్ సెంటర్‌లో రూ.2585లు, గ్రోత్ సెంటర్ (సెజ్)లో రూ.2225, సింగరాయకొండ పార్క్‌లో రూ.2396, గిద్దలూరులో రూ.770, దొనకొండ (ఎంఎస్ఎంఇ) లో రూ.825, రాగమక్కపల్లి(దొనకొండ యుడిఎల్)లో రూ.251, మార్కొండాపురం (పామూరు)లో రూ.605 చెల్లించవలసి ఉంది. నోటీసు పీరియడ్‌లోగా చెల్లించని పక్షాన పర్మిట్ రద్దు చేయవలసి ఉంటుంది. ఆ విధంగా చెల్లించని వారికి నోటీసులు జారీ చేశాము. కొందరు గడువు కోరారు. గడువు లోగా చెల్లించని పక్షాన స్వాధీనం చేసుకుంటాం.

ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు ఆహ్వానం..

ఖాళీగా ఉన్న ప్లాట్లను ఔత్సాహిక పారిశ్రామికవేత్తలకు కేటాయిస్తాము. పరిశ్రమ నెలకొల్పడానికి అవసరమయిన ప్రాజెక్ట్ రిపోర్ట్,యుటిలైజేషన్ సర్టిఫికెట్, ప్లాంట్ లే-అవుట్, ఫరం రిజ్రిస్టేషన్, ప్రోడక్ట్ వివరాలు, కాపిటల్ యుటిలైజేషన్, ఉపాధి అవకాశాలు,



నెట్‌వర్క్ సర్టిఫికెట్, వంటి డాక్యుమెంట్లతో దరఖాస్తు చేసుకోవచ్చు. భాగస్వామ్య పద్ధతిలో నెలకొల్పితే పార్టనర్ షిప్ డీడ్, నెట్ వర్క్ సర్టిఫికెట్ చార్టెడ్అకౌంటెంట్ నుంచి ధ్రువీకరణ, పాన్, ఆధార్ వంటి డాక్యుమెంట్లు జాతచేయ వలసి ఉంటుంది. ఎస్సీ, ఎస్టి అభ్యర్థులు కుల ధ్రువీకరణ పత్రాలు జత చేయాలి.

అనుమతి లేని ప్రాజెక్టులు తొలగిస్తాం..

నిబంధనల ప్రకారం ఇండస్ట్రియల్ పార్కుల్లో అనుమతి లేని ప్రాజెక్టులు నిర్వహిస్తే వాటిని ముందుగా నోటీసులు ఇచ్చి తొలగిస్తాం. ఏ ప్రాజెక్ట్ /పరిశ్రమకు అనుమతి పొందారో అదే ప్రాజెక్ట్/ పరిశ్రమ నిర్వహించాలి. లేని పక్షాన వాటిని తొలగిస్తాం. గ్రోత్ సెంటర్, ఆటో నగర్‌లో ఇటువంటి ప్రాజెక్టులను గుర్తించి నోటీసులు ఇచ్చాము. గడువులోగా తొలగించకుంటే చర్యలు తీసుకుంటాము.

ఆక్రమణలు నిలువరించేందుకు చర్యలు..

ఒంగోలు ఇండస్ట్రియల్ పార్క్‌లో ఇటీవల ఆక్రమణలు తొలగించాము, భవిష్యత్ లో ఆక్రమణలకు గురికాకుండా ప్రహరీ నిర్మించేందుకు చర్యలు చేపట్టాం. సింగరాయకొండ, ఒంగోలు ఉడ్ కంప్లెక్స్ లో ప్రహరీ నిర్మాణానికి ప్రతిపదనాలు పంపాము. కాగా గ్రోత్ సెంటర్ లో గ్రానైట్ వ్యర్థాలు వేసేందుకు 4 ఎకరాలు (2 ప్లాట్లు), కేటాయించాం. నిర్దేశించిన స్థలాల్లో కాకుండా ప్రైవేట్ స్థలాల్లో డంప్ చేస్తే నోటీసులు ఇస్తాం.